నాన్ స్టాప్ ప్రయత్నం



- టీడీపీలో చేరికకు ఎందుకింత ఆదుర్దా
- కేడర్ వ్యతిరేకిస్తున్నా బెజవాడలోనే మకాం
- ఇంకా ముహూర్తం ఖరారు చేయని టీడీపీ

ఎన్నికల ఓటమి అనంతరం వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని తాజాగా సైకిలు ఎక్కేందుకు ఉబలాట పడుతున్నారు. కొద్ది రోజులుగా ఎడతెరపి లేకుండా చేస్తున్న ఆయన ప్రయత్నాలకు తెలుగు తమ్ముళ్లు ససేమిరా వీల్లేదంటూ మోకాలడ్డారు. నాని టీడీపీలో చేరాలన్న తన నాన్ స్టాప్ ప్రయత్నాలు సక్సెస్ అవుతాయా లేదా విఫలమవుతాయో మరికొద్ది రోజుల్లోనే తేలబోతుంది. -7లో



కొత్త రక్తం వెతకండి!

పాలకొల్లులో దోమల సమావేశం

శానిటేషన్‌పై దృష్టి పెట్టని, తమ సంతతి వృద్ధికి సహకరిస్తున్న అధికారులను సత్కరించాలని నిర్ణయం

పట్టణ పారిశుధ్యం అధ్వానంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక వ్యంగ్య కథనం..6లో

టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ 91.64%

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మొత్తం ఓటర్లు 16,737 పోలైనవి 15,502

- ఏలూరు జిల్లాలో మొత్తం ఓటర్లు 2,667.. పోలైనవి 2,443.. పరిశీలించిన కలెక్టర్
- కాకినాడకు బ్యాలెట్ బాక్సులు తరలింపు.. 9న కౌంటింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. 16,737 మంది ఓటర్లకు గాను 15,502 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరిగింది.

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాల్లో 91.64 శాతం మేర పోలింగ్ నమోదైంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రారంభమైన ఉదయం 8 గంటల నుంచే పటిష్ట భద్రతతో పాటు కలెక్టర్ వెట్రిసెల్వి, మిగతా అధికారులు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, చాటపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మొత్తం 2 వేల 667 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే నాటికి 2 వేల 443 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యల్పంగా కుక్కునూరు పోలింగ్ కేంద్రంలో ఆరుగురు తమ ఓటు హక్కును ఉదయం 10 గంటల్లోపే నూటికి నూరు శాతం వినియోగించుకున్నారు. పెదవేగి పోలింగ్ కేంద్రంలో మొత్తం 65 మంది ఓటర్లు ఉండగా 64 మంది అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏలూరు అర్బన్, రూరల్ పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా ఉన్న ఓటర్లు సైతం ఉదయం పోలింగ్ ప్రారంభమైన దగ్గర నుంచే బారులుతీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల నాటికి 74.58 శాతం మేర 1989 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయం నాటికి 91.60 మేర పోలింగ్ శాతం నమోదైంది. మహిళా ఉపాధ్యాయులంటే పురుషులే అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికల్లో విశేషం. మొత్తం మీద 2 వేల 443 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా వీరిలో 1,387 మంది పురుషులు, 1,056 మంది మహిళలు ఉన్నారు.



ఏలూరు కోటదిబ్బ పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లాల వారీగా ఓట్లు	మొత్తం	పోలైనవి	శాతం
కాకినాడ	3418	3,118	91.22
తూర్పుగోదావరి	2,990	2,753	92.07
డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	3,296	3,138	95.21
అల్లూరి సీతారామరాజు	637	565	88.70
పశ్చిమగోదావరి	3,729	3484	93.43
ఏలూరు	2,667	2,444	91.64

అంతా సవ్యం : కలెక్టర్ వెట్రిసెల్వి

పోలింగ్‌తోపాటు పోలింగ్ సరళి యావత్తు ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ప్రకటించారు. బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత మధ్య సురక్షితంగా కాకినాడలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు తరలిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 9న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అధికారులు, పోలీస్ శాఖాధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చేశారంటూ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.



కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

13కు రెవెన్యూ సదస్సులు వాయిదా

- ఎమ్మెల్సీ కోడ్ కారణం

భీమవరంటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వాయిదా పడ్డాయి. వాస్తవంగా ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆమేరకు షెడ్యూల్ తయారీలో జిల్లా అధికారులు తలమునకలైయ్యారు. అయితే ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీకి వాయిదా వేశారు. ఎన్నికల కోడ్ ఈనెల 12 వరకు అమలులో ఉన్న నేపథ్యంలో ఆ తేదీని ఖరారు చేశారు. ఈ మేరకు 13వ తేదీ నుంచి సదస్సులు పూర్తిస్థాయిలో నిర్వహించేలా మండలంలోని షెడ్యూల్‌ను సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఏఎస్పీ

ఏలూరు క్రైం : ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని, అక్కడ ఉన్న బందోబస్తును అదనపు ఎస్పీ అదనపు ఎస్పీ సూర్యచంద్ర రావు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట వన్‌టౌన్ ఎస్‌ఐ మదీనా బాషా, త్రీ టౌన్ ఎస్‌ఐ అజయ్ ఉన్నారు.



బ్యాలెట్ బాక్స్‌కు సీల్ వేస్తున్న అధికారులు

బడికి రారండోయ్..

రేపు జిల్లాలో మెగా పేరెంట్స్ మీట్

- 1,788 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- విద్యార్థి పురోగతిపై తల్లిదండ్రులకు అవగాహన
- విద్యార్థులతోనే ఆహ్వాన పత్రికల తయారీ
- తల్లిదండ్రులకు ఆటల పోటీలు
- విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ

నిడమర్రు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజ నిర్మాణానికి విద్యనే కీలక ఆయుధం. విద్యావ్యవస్థ బలోపేతంగా ఉన్నప్పుడే నాణ్యమైన విద్యను పౌరులకు అందించగలం. విద్యావ్యవస్థ బలోపేతం కోసం కూటమి ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రస్థాయిలో మెగా తల్లిదండ్రుల సమావేశం ఈనెల 7వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని సంకల్పించింది. విద్యార్థుల ప్రయోజనాల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారు, అదేవిధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నుంచి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారో పరస్పరం తెలుసుకునేందుకు ఒక మంచి వేదికగా ఈ మెగా పేరెంట్స్ మీట్ నిలవనుంది. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు ఈ మీట్ జరగనుంది. మన బడి .. అన్న భావన తల్లిదండ్రుల్లో కల్పించడం కోసం వారిని పాఠశాల కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడం ముఖ్య ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

విద్యార్థి పురోగతికి దోహదం..

విద్యార్థి - ఉపాధ్యాయుడు - పేరెంట్ ఈ మూడు వర్గాలు సరైన అవగాహనతో ముందుకు వెళితే విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు సునాయసనంగా చేరుకోగలడు. ఈ మూడింటి మధ్య బలమైన అవగాహన వాతావరణం ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థికి మంచి మార్గదర్శకత్వం అందివ్వడం జరుగుతుంది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు, ఇంటివద్ద తల్లిదండ్రులు విద్యార్థి అభిరుచులు, శక్తి సామర్థ్యాలను అంచనా వేస్తే అతను భవిష్యత్తు చేపట్టబోయే వృత్తి ఎంపికలో కీలక పాత్ర వహించిన వారవుతారు.

పేరెంట్స్ మీట్ నిర్వహణ ఇలా..

పేరెంట్స్ మీట్ నిర్వహణను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించనుంది. సమావేశం సక్రమ నిర్వహణ కోసం ముందుగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి 13 రకాల కమిటీలు ఏర్పాటు చేశారు. ఆహ్వాన కమిటీ, బడ్జెట్, కొనుగోలు కమిటీ, పాఠశాల పరిశుభ్రతా కమిటీ, పర్యావరణ భద్రతా కమిటీ, స్వాగత కమిటీ, సిట్టింగ్ కమిటీ, ప్రగతి నివేదికల కమిటీ, స్టేజ్‌కమిటీ, సాంస్కృతిక కమిటీ, ఫుడ్ కమిటీ, హెల్త్ కమిటీ, ప్రెస్ కమిటీ మొదలగునవి ఏర్పాటు చేశారు.

జిల్లాలో పాఠశాలల సమాచారం	
ప్రాథమిక పాఠశాలలు	: 1372
ప్రాథమికోన్నత పాఠశాలలు	: 164
ఉన్నత పాఠశాలలు	: 215
హైస్కూల్ ప్లస్	: 37
మొత్తం	: 1788

ఆహ్వానంలోను స్పెషల్

ఈ సమావేశం ప్రత్యేకత ఏమిటంటే పాఠశాల విద్యార్థులతోనే తయారు చేయించిన ఆహ్వాన పత్రికలతో వారి తల్లిదండ్రులను కార్యక్రమానికి ఆహ్వానించడం. ఇలా చేయడం వల్ల పేరెంట్స్ ఎంతో సంతోషంగా భావించి పాఠశాల పట్ల అభిమానం పెంచుకుంటారనే భావనతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రులకు పోటీలు

తల్లిదండ్రులతో ఏదో తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించినట్టు కాకుండా ఓ ప్రత్యేకమైన ప్రణాళికతో సమావేశం నిర్వహించనున్నారు. పాఠశాలకు వచ్చిన తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రు లకు టగ్ ఆఫ్ వార్ (తాడు లాగుట) అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారు.



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం బ్యానర్

మరిన్ని ముఖ్యాంశాలు..

- సమావేశానికి హాజరైన తల్లులలో ఉత్సాహవంతులను ప్రోత్స హించి మదర్ యాంకరింగ్ చేయిస్తే సమావేశం మరింత ఆహ్లాదకరంగా సాగుతుందని భావిస్తున్నారు.
- నేడు అత్యధికంగా జరుగుతున్న సైబర్ క్రైం నేరాలపై మహిళా పోలీసుల సహకారంతో అవగాహన కల్పిస్తారు.
- ఉన్నత స్థానంలో ఉన్న పూర్వ విద్యార్థులను ఆహ్వానించి వారి ప్రసంగాల ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా అజెండాలో చేర్చారు.
- హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల ద్వారా విద్యార్థి భావవ్యక్తీకరణ, సహకారం, నాయకత్వం, తార్కిక ఆలోచన, పర్యా వరణం, కళలు, క్రీడా నైపుణ్యాలను పరిశీలించి విద్యాప్రగతితో పాటు నమోదు చేసి తల్లిదండ్రులకు అందిస్తారు.
- పాఠశాల నిర్వహణ, విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజన నిర్వహణ మొదలగు అంశాలలో తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరిస్తారు.

పాఠశాలకు హాజరయ్యే తల్లిదండ్రుల కోసం ప్రత్యేకంగా దాతల సహకారంతో శుభదిన్ భోజన్ ఏర్పాటు చేయనున్నారు.

తల్లిదండ్రుల్లో మన బడి అనే భావన కలుగుతుంది..



మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమా వేశం ద్వారా మన బడి అనే భావన తల్లిదండ్రులలో ఏర్పడుతుంది. ఉపాధ్యాయులకు, తల్లిదండ్రుల మధ్య సుహృద్భావ వాతావరణం కల్పించడమే దీని లక్ష్యం. జిల్లాలో 1788 పాఠశాలల్లో ఈ సమావేశాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. దీనికోసం బడ్జెట్ కేటాయించి ఆయా పాఠశాలల రోలు ఆధారంగా నిధులను ఆయా ప్రధానోపాధ్యాయులకు అందించాం. ఈ సమావేశంలో విద్యార్థుల హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందిస్తాం. పేరెంట్స్ తమ పిల్లవాడికి ఏ విధమైన విద్య కావాలో, ఏఏ సామర్థ్యాల్లో తమ పిల్లవాడు వెనుకబడి ఉన్నాడో అవగాహన కలిగి దాని నివారణకు ఏ చర్యలు చేపట్టాలో ఉపాధ్యాయులతో చర్చించడానికి మంచి అవకాశం కలుగుతుంది.

- వెంకట లక్ష్మమ్మ, డీఈవో

ఆత్మీయ సమ్మేళనంగా పీటీఏ సమావేశం : కలెక్టర్

ఏలూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం చర్చ నిమిత్తం ఈ నెల 7న ప్రభుత్వ పాఠశాలల్లో జరుగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఆత్మీయ సమ్మేళనంగా నిర్వహించాలని విద్యాధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పీటీఏ నిర్వహణపై గురువారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ కేవలం నిర్దేశిత విద్య సంబంధిత కార్యక్రమాలకే ఈ సమావేశం పరిమితం కావాలని, ఇతరుల ప్రమేయం ఉండరాదని స్పష్టం చేశారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎంఈవోలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న జేడీ హబీబ్ బాషా, అధికారులు

నేలను పరిరక్షించుకుందాం : జేడీ

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి ఎరువుల వినియోగంతో నేల దెబ్బతినే అవకాశం ఉందని, నేలలను పరి రక్షించుకుందామని వ్యవసాయ జేడీ హబీబ్ బాషా అన్నారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఐఏడీపీ హాల్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటల సాగు సరళిని, సేంద్రియ ఎరువుల వినియోగం, సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ సాగుపై రైతులకు వివరించారు. ముఖ్య అతిథిగా విజయరాయి వ్యవసాయ పరిశోధన కేంద్రం డా.వెంకటరమణ నేల ఆరోగ్య, సంరక్షణలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా నేల పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఏలూరు ఏడీఏ సుబ్బారావు, ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా డీపీఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రామాకేర్..మూసేశారు..!

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని జిల్లా ఆసుపత్రి గతేడాది ఏప్రిల్ 26 నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మార్పు చెందింది. మెడికల్ కాలేజీ రాకతో ఆసుపత్రిలో మరిన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయని అందరూ భావించారు. అప్పటి వరకు ఉన్న 550 పడకల ఆసుపత్రి కాస్త 300 పడకల ఆసుపత్రిగా మార్చి ఒకేసారి 250 పడకలు తగ్గించేశారు. ప్రస్తుతం 330 పడకలతోనే ఏలూరు సర్వజన ఆసుపత్రి కొనసాగుతోంది. వైద్య విధాన పరిషత్‌కు చెందిన వైద్యులు, సిబ్బంది, నర్సులు వేరే వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు బదిలీ చేశారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధీనంలో ఉండడంతో ఆ విభాగానికి వైద్యులు, సిబ్బంది, నర్సులను పంపించారు. సిబ్బంది కొరత ఉండడంతో వైద్య విధాన పరిషత్‌కు చెందిన ఆరుగురు వైద్యులను డిప్యూటేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగించారు. ఇటీవల ఆ వైద్యులను తిరిగి పంపించడంతో ఆయా విభాగాల్లో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ట్రామాకేర్ విభాగంలో వైద్య విధాన పరిషత్‌కు చెందిన న్యూరోసర్జన్‌ను ఇటీవల తిరిగి చింతలపూడికి బదిలీ చేశారు. ఆసుపత్రిలోని 15 పడకల ట్రామాకేర్ విభాగాన్ని మూసివేశారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు వస్తే ఆ కేసులను విజయవాడ, గుంటూరుకు ఇక్కడి వైద్యులు రిఫర్ చేస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద మెడికల్ బోర్డు సర్టిఫికెట్లను పొందాలంటే న్యూరోసర్జన్ సంతకం తప్పనిసరి. ఆయన లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే వారిని విజయవాడకు వెళ్ళాలని ఆసుపత్రి అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు నోటీసు బోర్డులోను పెట్టేశారు. ఆసుపత్రిలోని 26వ నెంబర్ ఐసీయూ విభాగంలోను సేవలు అంతంత మాత్రమే. మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మూతపడిన ట్రామాకేర్ వార్డు




వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి..ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరి

తోలేరులో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

నేటిరాత్రి స్వామికి కల్యాణం

8 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

భీమవరం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం తోలేరులోని వల్లీ దేవసేన సహిత షణ్ముఖ, సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి 12వతేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లును పూర్తిచేశారు. శుక్రవారం రాత్రి 7-15 నిమిషాలకు స్వామివారికి, అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 7వ తేదీ శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామివారికి సామూహిక అభిషేకాలు, దర్శనాలు ఉంటాయి. ఉదయం నుంచి ఆలయం వద్ద భజన, 9-30 నుంచి అఖండ అన్న సమారాధన జరుగుతుంది. సాయంత్రం 4 గంటలకు అష్టలక్ష్మి అమ్మవార్ల వాహనంపై స్వామివారికి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

12 వరకు నాటిక పోటీలు

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీ నుంచి 20వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు .9వ తేదీన కరీంనగర్‌కు చెందిన చైతన్య కళా భారతి వారిచే స్వప్నం రాల్చిన అమృతం నాటకం, అనంతరం కత్రిపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ వారిచే కిడ్నాప్ నాటిక, 10న రాత్రి 7.30 గంటలకు విశాఖపట్నం తెలుగు కళాసమితి వారిచే నిశ్శబ్దమా నీ ఖరీదెంత.. నాటకం, అనంతరం గుంటూరుకు చెందిన సద్గురు కళానియలం వారిచే కమనీయం.. 11వ తేదీ రాత్రి 7-30 గంటలకు గుంటూరువారి అభినయ ఆర్ట్స్ వారిచే ఇంద్రప్రస్థ నాటిక, అనంతరం పాలకొల్లు వారిచే అనూహ్యం నాటిక ప్రదర్శనలు ఉంటాయి. 12వ తేదీన విజేతలకు బహుమతులు ఉంటాయి. అనంతరం మిలట్రీ మాధవరానికి చెందిన జగత్ విజేత నాట్యమండలి వారిచే రాజనరక్తి నాటకం ఉంటుంది.

నేత్రపర్వం.. ధ్వజారోహణం

ద్వారకాతిరుమల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు నేత్ర పర్వంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉదయం విశేష కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అంకురార్పణ, అనంతరం ధ్వజారోహణ నిర్వహించారు. ఆలయంలో ధ్వజపటానికి హారతులిచ్చి పూజలు చేశారు. అనంతరం ఎగురవేసి సర్వాది దేవతలను స్వామి కల్యాణాన్ని వీక్షించేందుకు రమ్మని వేదమంత్రాలతో ఆహ్వానం పలికారు.



ద్వారకాతిరుమల ఆలయంలో అంకురార్పణ జరుపుతున్న అర్చకులు, పండితులు

క్షీరారాముని హుండీ ఆదాయం రూ 22.43 లక్షలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్థినీడి వెంకటేశ్వరరావు (భీమవరం) పర్యవేక్షణలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 22 లక్షల 43 వేల 859 రూపాయలు ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వాహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. 83 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని తెలిపారు. క్షీరా రామ సనాతన దాండియా గ్రూప్, శ్రీహరే శ్రీనివాస కోలాట భజన మండలి సభ్యులు, తపాలా ఉద్యోగులు



దేవదాయ శాఖ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పుష్ప హంగామా

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా రిలీజ్ సందర్భంగా తాడేపల్లిగూడెంలోని సినిమా థియేటర్‌ల వద్ద అభిమానులు సందడి చేశారు. కొందరు ఫ్లెక్సీలు, బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. పుష్ప సినిమాలో అల్లు అర్జున్ జాతరలో వేసిన గెటప్ వేసుకుని తాడేపల్లిగూడెం థియేటర్ వద్ద అభిమానులు ఇలా హంగామా చేశారు.

వీరి సేవలకు సెల్యూట్



ప్రజాస్వామ్యానికి, ప్రజలకు రక్షణ ఇచ్చేదెవరని అడిగితే పోలీసులనే చెబుతారు.. అయితే వారి వెన్నంటే ఉంటూ రేయనక పగలనక నిత్యం అందుబాటులో ఉంటూ వారితో పాటు సేవలందిస్తున్న హోంగార్డుల గురించి ఎవరూ చెప్పరు. పోలీసులతో పాటు విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంలో కీలకపాత్ర పోషిస్తు న్నారు హోం గార్డులు. ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి వేళల్లో పెట్రోలింగ్, పండుగలు, సంబరాలు, జాతర్లలో భద్రత, ప్రకృతి వైపరీ త్యాలు సంభ వించినప్పుడు సహాయం కోసం, సమ్మెలు, ఆందోళన సమయాల్లో ఎక్కువ శాతం విధులు నిర్వహించేది వారే. నామ మాత్రపు జీతాలతో సేవలందిస్తున్న వారి జీవన స్థితిగతులు మాత్రం అంతంత మాత్రమే.. నేడు హోంగార్డుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

పోలీసులకు చేదోడు..వాదోడుగా

శాంతి భద్రతల రక్షణలో కీలకం

అరకొర జీతాలతో ఇబ్బందులు

రిటైరైతే జీవనం దుర్భరం

నేడు హోంగార్డుల దినోత్సవం

ఏలూరు క్రైం/పోలవరం (ఆంధ్రజ్యోతి)

పోలీసులకు సహాయకులుగా పనిచేయడం, అంతర్గత భద్రతను నిర్వహించడంలో సహాయం చేయడం, ప్రకృతి వైపరీత్యాలు ఇతర అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయడం, దేశ రక్షణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వారికి ఇచ్చిన విధులను నిర్వర్తించడం వంటి అన్ని విభాగాల్లో వీరిని నియమిస్తున్నారు. జిల్లాలో హోంగార్డులు ట్రాఫిక్, పోలీస్‌స్టేషన్లు, దేవాలయాలు, విజిలెన్సు, జిల్లా జైలు, ఫైర్‌స్టేషన్, ఓఎన్‌జీసీ, తదితర విభాగాల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు, అగ్నిమాపక, సైనిక దళాల్లో పనిచేసే వారికి వివిధ పతకాలు, ప్రోత్సాహకాలను క్రమం తప్పకుండా ప్రతి రిపబ్లిక్ దినోత్సవంలో అందిస్తుంది..కానీ హోం గార్డులు ఏళ్ళ తరబడి సేవలు చేస్తున్నా వారికి కనీస గుర్తింపు లేకపోయింది. తమ గురించి కనీసం ఒక ప్రశంస విందామని ఎదురు చూసే హోంగార్డులకు నిరాశే ఎదురవుతుంది. కొంతమంది అధికారుల ఇళ్లలో వంట చేయడం, మార్కెట్‌కి వెళ్ళి నిత్యావసరాలు తీసుకురావడం, షాపింగులకు , ఊర్లకు వెళితే సామాన్లు మోసుకెళ్ళడం, వారి పిల్లలను స్కూళ్ళకు తీసుకెళ్ళి తీసుకు రావడం వంటి పనుల నుంచి తమను తప్పించాలని కోరుతున్నా వాటి నుంచి విముక్తి లభించడం లేదని కొంతమంది హోంగార్డులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు చెప్పిన పనులు చేయకపోతే వేధింపులకు గురి చేస్తున్నారని , మరికొన్ని చోట్ల మహిళా హోంగార్డులు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏలూరు జిల్లాలో పరిస్థితి ఇది

జిల్లాలో 404 మంది హోంగార్డులు ఉన్నారు. వీరిలో 316 మంది పురుషులు కాగా, 88 మంది మహిళలు ఉన్నారు. డిప్యూటేషన్‌పై 190 మంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. జిల్లాలోని ఉన్న పోలీస్ స్టేషన్లలో హోంగార్డులు పోలీసులకు సహాయకులుగా ఉండి సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ గస్తీలో వీరి పాత్ర ఎంతో కీలకం. హోంగార్డులకు రోజువారీ గౌరవ వేతనాన్ని ఏడు వందల రూపాయలుగా పరిగణించి నెలకు వేతనాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఏరోజు విధులకు హాజరు కాకపోతే ఆరోజు ఎలాంటి జీతం ఇవ్వరు. రోజుకు 8 గంటల పాటు వీరు విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ ఏడాది హోంగార్డులలో ఆరుగురు వివిధ అనారోగ్య కార ణాలతో మరణించగా, మరో వ్యక్తి అనుమానాస్పదంగా మరణించాడు. హోంగార్డులకు మట్టి ఖర్చు నిమిత్తం 10 వేల రూపాయలు, ఫ్లాగ్ ఫండ్‌కు 10 వేల రూపాయలు, డెత్ బెనిఫిట్ (చీఫ్ ఆఫీస్) నుంచి రెండు లక్షలు, ఎక్స్‌గ్రేషియో (చీఫ్ ఆఫీస్) ఐదు లక్షలు, మరణించిన లేదా పదవీ విరమణ చేసిన జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల ఒక్క రోజు వేతనాన్ని గౌరవంగా అందిస్తారు. ఎలాంటి పెన్షన్లు వీరికి ఉండవు. సాధారణంగా 18 నుంచి 50 ఏళ్ళ వయసు కలిగిన వారు హోంగార్డుగా వెళ్ళేవారు. నేడు నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉండడంతో అది ఒక ఉద్యోగంలా మారి పోయింది. దీనికి కూడా రిక్రూట్‌మెంట్ పెట్టి పరుగుపందెం, ఇతర పరీక్షలను నిర్వహించడం , కంప్యూటర్, డ్రైవింగ్ వంటి వాటిలో నైపుణ్యం ఉన్న వారిని రిక్రూట్ చేసుకుంటున్నారు.

1966లో చైనా యుద్ధం జరిగిన అనంతరం భారతదేశంలో హోంగార్డు ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇండియన్ పోలీస్ సర్వీసు (ఐపీఎస్)కు సహాయకులుగా వీరిని విధుల్లోకి తీసుకున్నారు. నవంబర్ 6వ తేదీన హోంగార్డు ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి 1946లోనే ముంబయిలోని ప్రావిన్స్‌లో హోంగార్డు దళం ఏర్పడింది. అప్పట్లో కేంద్రం హోంమంత్రిగా ఉన్న మొరార్జీదేశాయ్ ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం ఆలోచించి 1946 డిసెంబరు 6న హోంగార్డుల (గృహ రక్షక దళ సంస్థ) వ్యవస్థను ప్రారంభించారు. సమాజంలో చైతన్య వంతులు, విద్యావంతులు, సేవాతత్పరత, కలిగిన వారిని విధుల్లోకి తీసుకుని వారిని పోలీసులకు ప్రజలకు మధ్య వారధిగా ఉంచాలని భావించారు. 1962లో చైనా దురాక్రమణ జరిపినపుడు అక్కడ ప్రజలను ఆదుకోవడంలో హోంగార్డులు చేసిన సేవలు భరతజాతి ఎన్నటికీ మరువదు.

వారి సేవలు వెలకట్టలేనివి



జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల సేవలకు విలువ కట్టలేం. వారు స్వచ్ఛంధ సేవా కార్యకర్తలుగా, పోలీసులకు సమాంతరంగా విధులను నిర్వర్తిస్తూ సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా నేరస్తులను గుర్తించడం, అరెస్టు చేయడం, రాత్రివేళ గస్తీ, పోలీసుల వాహనాలకు డ్రైవర్లుగా విధులు నిర్వర్తించడం, స్టేషన్ రికార్డులను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం (కంప్యూటర్ వర్క్) వంటివి చేస్తూ ఎంతో సహాయ కారులుగా ఉంటున్నారు. వారి సంక్షేమానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే హోంగార్డులకు జిల్లా కేంద్రం ఏలూరులో డార్మెటరీ నిర్మించాం. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి వివిధ బ్యాంకర్లతో చర్చించి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో హోంగార్డులకు ఏ కష్టం వచ్చినా త్వరితగతిన పరిష్కరించడానికి ప్రతి శుక్రవారం నేరుగా వినతులను స్వీకరించి పరిష్కార చర్యలు తీసుకుంటున్నాం. ఎవరికి ఏ కష్టం వచ్చినా కలవాలని సూచించాం. వారి సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం.

కె.ప్రతాపశివకిషోర్, ఎస్పీ, ఏలూరు జిల్లా

చాలీచాలని జీతాలతో సతమతం...



భీమవరం క్రైం : పోలీసు సేవలతోనే వారు పోటీ... రాత్రింబవళ్ళు వారు కూడా సేవలు అందిస్తారు. అయితే జీతాలు మాత్రం అంతంత కావడంతో కుటుంబాల పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు సరిపడక కుటుంబాల పోషణ, పిల్లల చదువుల విషయంలో ఇబ్బందుల్లోనే ఉంటున్నారు. గతంలో తొమ్మిది వేలు ఉండే వేతనాన్ని అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్‌రెడ్డి రూ.12 వేలు చేశారు. తరువాత తెలుగు దేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 18 వేలకు పెంచారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రూ. 3300 పెంచింది. ప్రస్తుతం రూ.21,300 హోంగార్డులకు వేతనంగా ఇస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 900 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారు పదవీ విరమణ పొందిన తర్వాత జీవితాలు దుర్భరం అవుతున్నాయి. పదవీ విరమణ పొందిన వారికి జిల్లాలోని 900 మంది హోం గార్డుల జీతంలో ఒక్క రోజు వేతనం అంటే ఒక్కొక్కరు రూ.710 చెల్లించడంతో 6 లక్షలు పైనే సొమ్ములు ఆ వ్యక్తికి అందిస్తున్నారు. అంతేగానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు.

పీఎంజేజేబీవై పథకమే ఆసరా

హోంగార్డులు ప్రమాదవశాత్తు విధుల్లో చనిపోయినా, ప్రమాదాల్లో మృతి చెందినా పీఎంజేజేబీవై (ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన) పథకం ద్వారా రూ. 40 లక్షలు వచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికోసం నెలసరి జీతంలో రూ. 456లను బీమా కింద చెల్లించాల్సి వస్తుంది. అయితే ఈ పథకం చాలా మంది హోంగార్డుల కుటుంబాలకు ఆసరాగా నిలిచింది. పదవీ విరమణ పొందినవారు, విధుల్లో ఉన్నవారు మృతి చెందితే మట్టి ఖర్చుల క్రింద ప్రభుత్వం రూ. 10 వేలు చెల్లిస్తుంది.

వేతనాలు సమయానికి వస్తే చాలు



హోంగార్డులకు నెల నెలా ఇచ్చే వేతనాలు కొంత ఆలస్యం అవుతున్నాయి. కొంత ముందుగా ఇస్తే కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడతాయి. నెలనెలా 6 నుంచి 10వ తేదీలోగా జీతాలు అందుతున్నాయి. ఈలోగా చాలా అవస్థలు పడుతున్నాం.

డి.రాజు, హోం గార్డు, ఆకివీడు

పీఎఫ్ అందిస్తే మేలు



పదవీ విరమణ పొందిన తర్వాత ఎటువంటి ఆధారాలు ఉండటం లేదు. హోంగార్డుల ఒక రోజు వేతనం తప్ప మరేమీ దక్కడం లేదు. ప్రభుత్వాలు పీఎఫ్, ఇతర సౌకర్యాలు కల్పించి హోంగార్డులకు ఆసరా కల్పిస్తే బాగుంటుంది.

ఏడుకొండలు ,హోం గార్డు, పాలకొల్లు

అధికారులు గౌరవం ఇస్తారు



విధుల్లో అధికారులు గౌరవం ఇస్తారు. పోలీసులతో సమానంగా ప్రోత్సాహం అందిస్తారు. మేము కూడా ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తాం.

రాజారత్నం, హోం గార్డు, ఆకివీడు

సెటైర్

కొత్త రక్తం కోసం వెతకండి

పాలకొల్లులో దోమలన్నీ సమావేశమయ్యాయి..తమ సంతతి అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించాయి.. ఇటీవల కాలంలో ప్రజల్లో రోగాలపై ఆందోళన తగ్గడంతో ఆగ్రహం వ్యక్తం చేశాయి.. పాలకొల్లులో అధికారులు సరైన చర్యలు చేపట్టక పోవడంతో పారిశుధ్యం క్షీణించడంపై ఆంధ్రజ్యోతి సెటైరికల్ కథనం...



పాలకొల్లులో దోమల కాన్ఫరెన్స్

వేదిక బస్టాండ్ వద్ద మేజర్ డ్రెయిన్

క్యూలెక్స్ దోమ అధ్యక్షత

ముఖ్య అతిథిగా అనాఫెలస్ దోమ


శానిటేషన్ అధ్వానంపై సంతృప్తి

అధికారుల తీరుపై ఆనందం

బోదవ్యాధికి పూర్వ వైభవం తేవాలని పిలుపు

రక్తం రుచి తగ్గిపోతుందని కుర్రదోమల ఆవేదన

గంబూషియా జాడ లేకపోవడంపై హర్షం



ఉభయ గోదావరి జిల్లాలోని దోమలు కాన్ఫిరెన్స్ నిర్వహించుకోవడానికి పాలకొల్లు పట్టణాన్ని ఎంపిక చేసుకున్నాయి. శానిటేషన్ అత్యంత ప్రమాద స్థాయికి దిగజారడంతో బస్టాండ్ ప్రాంతంలోని మేజర్ డ్రెయిన్ వద్ద వేదిక చేసుకుని సమావేశమయ్యాయి. ఈ సమావేశానికి తణుకు ప్రాంతం నుంచి వచ్చిన క్యూలెక్స్ దోమ అధ్యక్షత వహించింది. భీమరానికి చెందిన ఎనాపిల్స్ దోమ ముఖ్య అతిథిగా పాల్గొంది. పాలకొల్లు పట్టణం ఫాగింగ్, డ్రెయిన్లలో మలాథియాన్ పిచికారీ లేకపోవడం వల్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న దోమలు ఒకింత ఆనందం వ్యక్తం చేశాయి. కాన్ఫరెన్స్‌లో వివిధ పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చిన అనేక జాతుల దోమలు పాల్గొన్నాయి. పాలకొల్లు పట్టణంలోని ఆడ దోమల్లో స్థూలకాయాన్ని గమనించిన వేదికపై ఉన్న దోమలు ఆనందం వ్యక్తం చేశాయి. దీనికి కారణం పురపాలక సంఘం ప్రజా రోగ్య విభాగంలోని అధికారులు సిబ్బంది దోమల నిర్మూళనకు చర్యలు తీసుకోకపోవడమే కారణమని గమనించాయి. ఇదేవిధానం కొనసాగితే ఆడదోమలు మానవ రక్తం మరింతగా తాగి స్థూలకాయులుగా మారి పునరుత్పత్తికి ఆటంకం కలుగుతుందని వైద్యం తెలిసిన దోమల ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ అంశంపై పురపాలనను అభిసంశస్తూ దోమల తీర్మాణం చేశాయి.

పారిశుధ్యం నిర్లక్ష్యంపై ఆనందం

పట్టణంలోని నీరు నిల్వ ఉన్న గుంటలు, డ్రెయిన్లలోనూ గంబూషియా చేపలను వదలక పోవడంపై దోమలు ముక్కున వేలేసుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 250 మిలియన్ల పైబడి మలేరియా కేసులు నమోదైతే మన దేశంలోనే 83 శాతం ఉండటం గమనార్హం. కాగా పాలకొల్లులో అత్యధికంగా ఉండటంపై దోమలు ఒకింత ఆనందం వ్యక్తం చేశాయి. గంబూషియా చేపలను నీటి గుంటల్లో వదిలితే దోమలు లార్వా దశలోనే చనిపోయి వాటి సంఖ్య తగ్గుతుందని అయితే అలా చేయనందున దోమ సంతతి పెరిగిపోయి పాలకొల్లు పట్టణంలో ప్రజలు దోమలను అసహ్యించుకునే పరిస్థితి వచ్చిందని సమావేశంలో చర్చించారు. అతిథులుగా పాల్గొన్న దోమలు దీనిపై ఆనందం వ్యక్తం చేశాయి.

రక్తం రుచి తగ్గిపోతోంది !

మానవ రక్తం రుచి తగ్గిపోతుందని సమావేశంలో పాల్గొన్న కుర్రదోమలు ఫిర్యాదు చేశాయి. దీనిపై అధ్యయనం చేసిన మేధావి దోమలు కుర్రదోమలను మందలించాయి. ఒకే ప్రాంతంలో ఒకే కాలనీలో ఉన్న మానవుల రక్తం తాగితే రుచి తగ్గుతుందని మార్కెట్ ప్రాంతాలకు, బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు వెళితే కొత్త రక్తం దొరుకుతుందని సూచించాయి. అత్యంత దుర్గంధంగా ఉన్న ఈ ప్రాంతంలో ఏర్పాట్లు చేసిన స్థానిక దోమలను జిల్లా నుంచి వచ్చిన అతిథి దోమలు అభినందించాయి. అతిథి దోమలు పట్టణంలోని డ్రెయిన్ల వెంబడి పరిశీలనకు వెళ్లాయి. క్యూలెక్స్ దోమ మిగిలిన అతిథి దోమలు పట్టణంలోని చిత్తడి ప్రాంతాలను సందర్శించాయి. ఆయా ప్రాంతాల్లో దోమలకు పలు సూచనలు చేశాయి. మానవులను పదేపదే కుట్టి పీడించవద్దని ఇప్పటికే మలాథియాన్, క్రిమిసంహారక మందులు అధికారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నందున దోమల సంతతి నానాటికి పెరిగిపోతుందని వివరించాయి. జిల్లాలోనే పాలకొల్లు పట్టణ ప్రజలు తమజాతిని అత్యంత హీనంగా చూడటం బాధాకరంగా ఉందని అవసరం మేరకు రక్తం పీల్చమని అతిథి దోమలు సూచించాయి.

పైలేరియా ఎందుకు తగ్గింది ?

రెండోరోజు కాన్ఫరెన్స్‌లో ముఖ్యంగా బోద వ్యాధిపై దోమలు చర్చించాయి. ఐదారు దశాబ్దాలకు ముందు పాలకొల్లులో బోదకాలు వ్యాధి అధికంగా ఉండేదని అనంతరం మెరుగుపడిందని స్థానికంగా ఉన్న దోమలు పెద్దల దృష్టికి తెచ్చాయి. పైలేరియా వ్యాధిని కలుగజేసే జాతి దోమలు తగ్గడంపై వేదికపై ఉన్న దోమలు ఆందోళన వ్యక్తం చేశాయి. వీటి ఉత్పత్తిని పెంచాలని సూచించాయి. పైలేరియాకు పేరున్న పట్టణానికి మరోసారి ఆ గుర్తింపు తేవాలని సూచించాయి. పాలకొల్లు పురపాలక సంఘానికి గత ఆరేళ్లగా ప్రజా ప్రతినిధులు లేకపోవడం ప్రత్యేకాధికారి పాలనలోనే ఉండటంతో పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించడాన్ని కొన్ని దోమలు సమావేశం దృష్టికి తెచ్చాయి. పురపాలక సంఘానికి ఎన్నికలైతే పరిస్థితి మారు తుందని చెప్పాయి. మొత్తంగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పాలకొల్లు డ్రెయిన్లకు నూరుశాతం మార్కులు వేశాయి. ఇంతటి దర్గంధం వెదజల్లే డ్రెయినేజీ వ్యవస్థ మరెక్కడా లేదని దోమలు స్పష్టం చేశాయి. తెలంగాణ పట్టణాలో నీటి కుంటల్లో డ్రెయిన్లలో, చెరువల్లోనూ నేరుగా అక్కడి ప్రజా ప్రతినిధులే గంబూషియా చేపలను వదలుతున్నారని సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఒక తెలంగాణ ప్రాంత దోమ తెలిపింది. మన దగ్గర అంత సీన్ లేదని ఒక వేళ అలా జరిగితే మూటా ముళ్ల సద్దుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.. **- పాలకొల్లు**

వసతి గృహంలో అమ్మలా..



పెనుమంట్ర,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వసతి గృహాలలో మెరుగైన మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో మరింత రాణించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం పెనుమంట్ర మండలం పొలమూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వసతి గృహంలో అత్యవసర మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారిని ఆదేశించారు.మధ్యాహ్న భోజనం సమయం కావడంతో పిల్లలతో కలిసి భోజనం చేశారు. మీరు మాతో కలిసి తింటున్నారేంటి అని ఒక విద్యార్థి అడగడంతో మీరు తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువు కుంటున్నారని అందరూ సమానమే అనే భావన మీలో కలిగించేందుకే నేను మీతో కలిసి భోజనం చేస్తున్నానని బదులిచ్చారు. భోజనం చేస్తునంతసేపు విద్యార్థులతో అమ్మలా ముచ్చటిస్తూ వారిలో సంతోషాన్ని నింపారు. భోజనం ఎలా ఉంటోంది? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.

తరగతి గదిలో టీచర్‌లా..



ఏలూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి కొద్దిసేపు టీచర్‌గా మారిపోయారు. పిల్లలతో మమేకమయ్యారు. గణితంలో హెచ్చివేతలు, భాగాహారాలు ఇచ్చి చేయించారు. బ్లాక్‌బోర్డుపై అంగ్లపదాలు రాసి పలికించారు. బాలలు స్పందించిన తీరుకు అబ్బురపడ్డారు. స్కూలులో బోధిస్తున్న ఉపాధ్యాయులను సైతం అభినందించారు. గురువారం ఏలూరు నగరంలోని పవర్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ అక్కడ మూడోతరగతి చదువుతున్న పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఇక మీదట జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయా ప్రాంతాలకు వెళ్ళినపుడు స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని, మధ్యాహ్న భోజన పథకం ఆహారపదార్థా నాణ్యత లేకపోతే అక్కడికక్కడే బాధ్యులపై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. స్కూలులో మధ్యాహ్న భోజన పథకం సరుకుల స్టాక్ రిజిస్టర్, స్టోర్‌ను పరిశీలించారు. అశోక్‌నగర్‌లోని అశోకవర్ధిని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రాన్ని సందర్శించి విలీనవిద్య బోధించే రిసోర్స్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. త్వరలో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ పరికరాలను అందించేందుకు తీసుకుంటున్న చర్యలను సమగ్రశిక్ష ఐఈ జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కరరాజు కలెక్టర్‌కు వివరించారు.



పోలవరంలో కలాల్లపై ఉన్న ధాన్యం

మబ్బుల వాతావరణం.. రైతుల ఆందోళన

చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల నుంచి మబ్బుల వాతావరణం తో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మండలంలో ఇంకా సుమారు వెయ్యి ఎకరాల్లో వరి కోతలు జరగాల్సి ఉంది. పోలవరం, చీపురుగూడెం, కోటపాడు, మర్లపాలెం తదితర గ్రామాల్లో కల్లాల్లో ధాన్యం భారీగా ఉంది. ఈ పరిస్థితి లో వర్షం పడితే తీవ్రంగా నష్ట పోతామని రైతులు భయపడుతున్నారు.

వచ్చే నెల 20, 27 తేదీల్లో కొల్లంకు ప్రత్యేక రైళ్లు

నరసాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శబరిమలై వెళ్లే భక్తుల కోసం జనవరిలో నరసాపురం నుంచి కేరళలోని కొల్లం వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ఎస్ఎం మధుబాబు చెప్పారు. జనవరి 20, 27 తేదీల్లో 07157 నెంబర్‌తో మధ్యాహ్నం 1.30 గంటలకు కొల్లంకు ప్రత్యేక రైలు బయలుదేరుతుంది. మరుసటి రోజు రాత్రి 9.00కు కొల్లంకు చేరుకుంటుందన్నారు. ఈరైలు విజయవాడ, గుంటూరు, కొయంబత్తూర్, ఎర్నాకులం మీదుగా కొల్లం వెళుతుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 22, 29 తేదీల్లో 07158 నెంబర్‌తో కొల్లంలో తెల్లవారుజామున 2.30కి బయలుదేరి రెండోవ రోజు తెల్లవారుజాము 6.30 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.

111 మంది ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగుల తొలగింపు

సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు పయనమైన ఉద్యోగులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్హతలున్నప్పటికీ మెరిట్‌లేకుండా పొందుతున్న ఉద్యోగ నియామకాలు చెల్లవంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా వైద్యఆరోగ్యశాఖ గతంలో జరిపిన రిక్రూట్‌మెంట్‌లో నియామకాలు పొందిన 111 మంది కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ(టెర్మినేట్) డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలావున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్యఆరోగ్యశాఖలో 2002లో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ) నియామకాలు జరిగాయి. ఈ ఉద్యోగాలకు విద్యార్హతల విషయంలో విడుదలైన రెండురకాల జీవోల్లో అస్పష్టత నెలకొనడంతో ఇంటర్మీడియట్, పదోతరగతి విద్యార్హతలతో నియామకాలు పొందినవారి మధ్య ఒకింత వివాదం ఇప్పటికీ కొనసాగుతోంది. జీవోల్లో లొసుగులను అడ్డుపెట్టుకుని కోర్టు ఉత్తర్వులతో ఉద్యోగాలు పొందుతున్నవారు ఇప్పటికీ ఉన్నారు. ఈ క్రమంలో మెరిట్‌లేకుండా ఉద్యోగాలు చేస్తుండటం, ఆ మేరకు జీవోల్లో నియామకాలకు సహేతుకతను సవాల్‌చేస్తూ ఒకరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం తీర్పును వెలువరిస్తూ నిర్దేశిత జీవోల్లో వివాదానికి కారణమైన, సహేతుకతలేని జీవో 1207ని కొట్టివేస్తూనే ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న వారిలో మెరిట్‌ప్రకారం రిక్రూట్ అయిన వారిని కొనసాగించే విషయాన్ని పరిశీలించాలని గతనెల 29న ఇచ్చిన తుదితీర్పులో ఆదేశించింది. తీర్పుపై అప్పీల్‌కు మూడునెలలు గడువు నిచ్చింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతం ఉద్యోగాల్లోవున్న 111 మంది కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ(మేల్)లను విధులనుంచి టెర్మినేట్ చేయడానికి డీఎంహెచ్‌వో కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. నియామకం, పునర్నియామకం కింద రెండు విధానాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో జీవో 1207 ద్వారా ఉద్యోగాలు పొందిన 69మంది, మరో 42 మందిని టెర్మినేట్‌చేస్తూ సంబంధిత ఉద్యోగులను ఉటంకిస్తూ రెండు రకాల టెర్మినేట్ జాబితాలను డీఎంహెచ్‌వో జారీ చేశారు. దీంతో సంబంధిత ఉద్యోగులు అప్పీల్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేసేందుకు రాజధానికి వెళ్ళినట్టు సమాచారం.



విద్యార్థులతో మాట్లాడుతున్న కాకినాడ ఆర్జేడీ నాగమణి

పోలింగ్ రోజున విధులకు అభినందనీయం: ఆర్జేడీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న బాలబాలికలకు అదనపు తర్ఫీదు కోసం ఎస్సీఈఆర్టీ నిర్దేశించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు తీరును పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(కాకినాడ ఆర్జేడీ) జి.నాగమణి గురువారం జిల్లావ్యాప్తంగా పలు హైస్కూళ్ళలో పరిశీలించారని డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీసీఈబీ కార్యదర్శి ఏ.సర్వేశ్వరరావు తెలిపారు. తడికలపూడి, కామవరపుకోట తదితర ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ వెట్రిసెల్వి పేద కుటుంబం నుంచి వచ్చినప్పటికీ బాగా చదువుకోవడం వల్లే కలెక్టర్ అయ్యారని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానెల్స్, తదితర సదుపాయాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున కూడా టీచర్లు విధులకు హాజరై విద్యార్థులకు తరగతులు నిర్వహించడం అభినందనీయ మన్నారు. డీఈవో కార్యాలయ ఏడీ-2 షరీఫ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నన్నయలో 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) :ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్య కళాశాలలో ఈ నెల 9 న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వైశ్రీనివాసరావు గురువారం తెలిపారు. బీఈడీ రెండు సంవత్సరాల కోర్సుకు బీఏ, బీకామ్, బీఎస్సీ, బీటెక్ డిగ్రీ పూర్తి చేసి ఎడ్‌సెట్-2024 పరీక్ష రాసిన వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 40శాతం, సీఈ విద్యార్థులకు 50శాతం మార్కులు డిగ్రీలో పొంది ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 9వ తేదీన ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వం నిర్ణయించిన రూ.16,500 ప్రవేశ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను లేదా 7093008473 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

జాలిపూడి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ఏలూరురూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్టు తేలడంతో సర్పంచ్ చెక్‌పవర్‌ను ఆరు నెలలపాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి నోటీసులు జారీ చేశారు. వివరాలు ఇలావున్నాయి. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామ సర్పంచ్ ఇటీవల జనరల్ ఫండ్స్ 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు 1,30,000 రూపాయలు దుర్వినియోగం చేసినట్లు ఉప సర్పంచ్ బుజ్జి, పలువురు వార్డు సభ్యులు జిల్లాపంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనితో కొద్దిరోజుల క్రితం డీఎల్‌పీవో విచారణ చేశారు. విచారణలో నిధులు దుర్వినియోగమైనట్లు తేలడంతో నివేదికను డీపీవోకు అందజేయగా ఆయన చర్యలకై జిల్లా కలెక్టరుకు అందజేశారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ చెక్ పవర్‌ను ఆరునెలలపాటు నిలిపి వెయ్యాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శికి డీపీవో నోటీసులు అందజేశారు.



యోగా పోటీలకు ఎంపికైన నన్నయ పురుషులు, మహిళల జట్టు

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదం

దివాన్‌చెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో యోగా అంతర్ కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు యోగా దోహదపడుతుందని, యోగాసనాల్లో విద్యార్థులంతా పట్టుసాధించి ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల మాట్లాడుతూ యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది వంతున విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశామని తెలిపారు.

పురుషుల జట్టు

టి.సూర్య, జి.స్వామి (ఎస్‌కేవీటీ ప్రభుత్వడిగ్రీకళాశాల, రాజమహేంద్రవరం), టి.పవన్‌కుమార్, కె.పవన్‌కుమార్, డి.మణికంఠ, జె.మణిసత్య (ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు) పి.సత్తిబాబు, ఎం.హరింద కిషోర్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమండ్రి) ఎంపికయ్యారు.

మహిళల జట్టు

బి.భవానిప్రసన్న, బి.నాగలక్ష్మిదుర్గ, కె.జ్యోతి, ఎ.సౌమ్య నాగవల్లి (ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు) సీహెచ్ మాధవి (డీఎన్ఆర్ కళాశాల, భీమవరం) టి.లావణ్య పి.నాగలక్ష్మి (ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు) కె.హర్షనదేవి (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం) ఎంపికయ్యారు.

వీరు ఈనెల 24 నుంచి 27 వరకూ ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శులు కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, పరిశీలకుడు ఎల్.రమేష్, ఎంపిక కమిటీ సభ్యులు శివశంకర్, ఇ.గౌరిఅనూష, వ్యాయామ విద్యఅ ధ్యాపకులు బి.రామ్‌గోపాల్, డేవిడ్, సుబ్రహ్మణ్యం బాషా తదితరులు పాల్గొన్నారు.

నాన్‌స్టాప్ ప్రయత్నం!

ఒకప్పుడాయన కాంగ్రెస్‌లోను, ఆ తరువాత వైసీపీలోను తిరుగులేని నేతగా ఉన్నారు. ఏలూరు కేంద్రంగా ఆయన 1999 నుంచి ప్రతిసారి అసెంబ్లీ బరిలోకి దిగి మూడుసార్లు గెలుపొందారు. జగన్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవితో ఉమ్మడి జిల్లానే దాదాపు శాసించారు. కాని రాజకీయాల్లో అదృష్టం కలిసొచ్చి ఇన్నాళ్ళు ఆయన ఆడిందే ఆట.. పాడిందే పాట. అలాంటి నేత ఒక్కసారిగా వైసీపీ నుంచి రాజీనామా చేయడమే కాకుండా ఇకముందు క్రియాశీలక రాజకీయాల్లో నేనుగాని, నా కుటుంబంగాని ఉండరంటూ వీర శపథం చేశారు. కాని ఎందుకో.. ఏమో ఆయన మనస్సు మార్చుకున్నారు. సైకిలెక్కేందుకు ఉబలాటపడుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా ఎడతెరపిలేకుండా చేస్తున్న ఆయన ప్రయత్నాలకు తెలుగు తమ్ముళ్ళు ససేమిరా వీల్లేదంటూ మోకాలడ్డారు. నాని టీడీపీలో చేరాలన్న తన నాన్‌స్టాప్ ప్రయత్నాలు సక్సెస్ అవుతాయా, విఫలమవుతాయో మరికొద్ది రోజుల్లోనే తేలబోతుంది.

- నాని టీడీపీలో చేరికకు ఎందుకింత ఆదుర్దా
- కేడర్ వ్యతిరేకిస్తున్నా బెజవాడలోనే మకాం
- ఇంకా ముహూర్తం ఖరారు చేయని టీడీపీ
- ఆచితూచి నిర్ణయానికి మొగ్గు
- సీఎం చంద్రబాబుకు అన్నీ వివరించిన ఎమ్మెల్యే చంటి
- శనివారం జరగాల్సిన భేటీ వాయిదా?



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

సాధారణంగా ప్రభుత్వాలు మారినప్పుడల్లా అప్పటిదాకా అధికార పార్టీలో ఓ వెలుగు వెలిగిన వారంతా అమాంతం ప్లేటు తిప్పేస్తారు. కొత్త పార్టీల్లోకి జంప్ చేస్తారు. సీనియర్లైతే ఎలాంటి అడ్డంకులు లేకుండా అన్ని పార్టీలు తలుపులు బార్లా తీసి ఉంచుతాయి. అదీ ప్రత్యేకంగా బలమైన సామాజిక వర్గనేతలైతే ఇక చెప్పనక్కర్లేదు. ఎదురేగి మరీ స్వాగతం పలుకుతారు. ఈ వ్యవహారం మాత్రం సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానికి మాత్రం రివర్స్ అయ్యింది. ఆయన లోపాయికారిగా కొందరి ప్రయత్నాలతో టీడీపీ వైపు తొంగి చూశారు. ఆయనను ఏదొక రూపంలో పార్టీలోకి రప్పించేందుకు కొందరు నేతలు తెరవెనుక చక్రం తిప్పారు. టీడీపీ అధినాయకత్వాన్ని ఒప్పించి పని చక్కబెట్టేందుకు అంతరంగం సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలోనే నాని చేరిక దాదాపు ఖరారైంది. అంతలోనే ఆయన చాన్నాళ్ళుగా ఏలిన ఏలూరులో టీడీపీ కేడర్ ఒక్కసారిగా రివర్స్ అయ్యింది. ఆయనేంటి.. పార్టీలోకి తీసుకోవడం ఏమిటంటూ ఏకంగా పార్టీ అధినాయకత్వానికి పుంకానుపుంకాలుగా ఫిర్యాదులు పంపారు. సోషల్ మీడియాలో ఆళ్ల నాని రాకను అపహాస్యం చేస్తూ పోస్టులు పెట్టారు. ఆయన ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండగా వైసీపీకి పూర్తి న్యాయం చేసేందుకు తెలుగుదేశం కేడర్‌ను అన్ని విధాలా దెబ్బతీసి తొక్కేయడానికి ప్రయత్నించిన సంఘటనలను వరుసగా పేర్కొంటూ కొన్ని వీడియోలను కూడా తెలుగుదేశం అధిష్ఠానానికి చేరవేశారు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే మంగళవారం నాడే నాని టీడీపీలో చేరిక జరిగిపోయి ఉండేది. కాని దీనికి విరుద్ధంగా అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. మిగతా నియోజకవర్గాల్లో మాదిరిగానే ఏలూరులో కూడా వైసీపీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హోదాలో నాని చేరిక సులభతరమే అనుకున్నారు. అంతకుముందు ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ చైర్మన్‌ను, ఏలూరు నగర మేయర్‌ను, మరికొంతమంది కార్పొరేటర్లను అలవోకగా టీడీపీలో ఆహ్వానించడమే కాకుండా వారిని సగౌరవంగా పార్టీలో చేర్చుకుని సముచిత స్థానం ఇచ్చారు. అదీకాక రెండు దశాబ్దాలకుపైగా రాజకీయంగా ఓ వెలుగు వెలిగిన ఆళ్ల నాని విషయంలో ఎలాంటి అడ్డంకులు ఉండబోవని భావించినా దీనికి విరుద్ధంగానే టీడీపీలో కొత్త కొత్త సమస్యలు తలెత్తాయి.

వస్తే.. అవమానమే..

తెలుగుదేశం కేడర్ నిర్ణయానికి భిన్నంగా పార్టీ అధినాయకత్వం ఆళ్ల నానిని పార్టీలో చేర్చుకున్నా ఆ తరువాత ఆయనకు అవమానాలు తప్పవంటూ ఏకంగా తెలుగుదేశం సీనియర్ నేతలు కొందరు వ్యక్తిగత సందేశాలు పంపారు. ఏలూరులో ఎమ్మెల్యేగా, వైసీపీ నేతగా మీరు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు.. అప్పుడేమో కారుకూతలు, ఇప్పుడేమో నీతి కబుర్లా అంటూ ఎద్దేవా చేశారు. ఇలాంటి తరుణంలోనే మంగళవారం ఆళ్ల నాని చేరిక కాస్తా వాయిదా పడింది. సీనియర్ అయిన ఆళ్ల నాని తొలిసారిగా ఇలాంటి చేదు అనుభవం ఎదుర్కొంటున్నారు. ఆయన విజయవాడలోని ఒక ప్రముఖ హోటల్‌లో మకాంవేసి టీడీపీ నుంచి ఎప్పుడు కబురొస్తుందా అని ఏకంగా మూడు రోజుల నుంచి ఎదురుచూస్తూనే వచ్చారు. ఆయనను పార్టీలోకి చేర్చేందుకు చక్రం తిప్పిన నేతలు.. అందుబాటులో ఉండండి ఎప్పుడైనా మీకు కబురు రావొచ్చంటూ ఇచ్చిన సందేశాలతోనే ఆళ్ల నాని విజయవాడలో మకాం వేశారు. కాని సీనియర్ నేత క్రియాశీలక రాజకీయాల్లో ఉండనని చెప్పి మళ్ళీ ఇలా పడిగాపులు పడాల్సిన స్థితికొచ్చారంటూ ఏలూరులో కామెంట్లు వినిపిస్తున్నాయి. ఉన్నన్నాళ్ళు తిరుగులేకుండా కథ నడిపి ఇప్పుడు టీడీపీలో చేరేందుకు ఎందుకు పాకులాడాల్సి వచ్చిందంటూ ఆయనకు ఒకప్పటి సన్నిహితులు కాస్తంత చీత్కార ధోరణిలోనే ఉన్నారు. కాని టీడీపీలోకి చేరడానికి బలమైన కారణమే ఉందని, అందు కోసమే పార్టీలోకి చేరేందుకే ఇప్పుడు అనేక మెట్లు దిగి ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని మరికొందరు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఏలూరు ఎమ్మెల్యేల బడేటి చంటి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆళ్ల నాని పార్టీలోకి రాక విషయాన్ని ప్రస్తావిస్తూ పార్టీ కేడర్ వద్దంటున్నారు. వాళ్ళిష్టమే నా ఇష్టం కూడా. కాని మీరన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకుంటారనుకుంటున్నామని తమ అభిప్రాయాన్ని సీఎం చెవిన వేశారు. ఈనెల 9న జరగాల్సిన సీఎంతో పార్టీ నేతల భేటీ దాదాపు జరగకపోవచ్చునని సంకేతాలు అందుతున్నాయి. బడేటి కుటుంబం సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉండడమే కాకుండా ప్రతిసారి ముక్కుసూటిగానే వ్యవహరిస్తుంది. నాని రాక విషయంలోను అదే జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు సీనియర్ నేత, మంత్రి అచ్చెన్నాయుడును, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును కలిసి పార్టీ కేడర్ ఏమనుకుంటున్నారో, ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సోదాహరణంగా వివరించినట్టు సమాచారం.

ఇళ్ల నిర్మాణానికి పీఎంఏవై-2.0 నిధులు

ఈనెల 24 లోగా దరఖాస్తులు చేసుకోవాలి

భీమవరం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో స్థలం ఉండి ఇళ్ళు నిర్మించుకోవాలనే లబ్ధిదారులకు పీఎంఏవై-2.0 పథకం కింద నిధులు మంజూరు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈమేరకు హౌసింగ్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నెల 24వ తేదీలో లోగా దరఖాస్తులు చేసుకోవలసి ఉంటుంది. 3.40 స్క్వేర్‌ఫీట్ స్థలం ఉండి ఏడాదికి 3లక్షల లోపు ఆదాయం కలిగి, తెలుపు రంగు రేషన్ కార్డు ఉన్నవారు ఈ పథకంలో దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. గ్రామాల్లోనైతే డిజిటల్ అసిస్టెంట్, పట్టణంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యాప్‌లో వివరాలు నమోదు చెయ్యాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు అర్హులైన లబ్ధిదారులు తెలుపు రంగు రేషన్ కార్డు, భార్య, భర్త ఆధార్ కార్డులు, స్థలం డాక్యుమెంట్‌లు, బ్యాంకు అకౌంట్ బుక్, ఉంటే పాన్ కార్డు 3లక్షల లోపు ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఇవ్వలసి ఉంటుంది. వీటిని ప్రత్యేక యాప్‌లో కానీ, వైఎంఏవై వెబ్ సైట్‌లో నమోదు చేసి వివరాలను ఆన్‌లైన్ చేస్తే దరఖాస్తులు హౌసింగ్ శాఖకు చేరతాయి. సంబంధిత అధికారులు నేరుగా స్థలాలను పరిశీలించి వాస్తవాన్ని గుర్తించి ఆమోదం తెలిపినే నిధులు మంజూరు అవుతాయి. లక్షా 50వేల రూపాయలు నిధులు మంజూరు అవుతాయి.

ఇళ్ల నిర్మాణం చేసిన వారి పరిస్థితి ఏమిటి

గతంలో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో నిధులు మంజూరు చేయిస్తామని, ఎన్నికల కోడ్ కారణంగా మంజూరు కావటంలేదని, ఇళ్ళ నిర్మాణం చేసుకోండని అప్పట్లో నాయకుల భరోసా ఇచ్చారు. దీనితో ఇళ్ల నిర్మాణం చేసుకున్నా, చేసుకుంటున్న లబ్ధిదారుల పరిస్థితి అయోమయంగా మారింది. వీరు అర్హత ఉన్నా నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వివరాలను నమోదు ఆన్‌లైన్‌లో కుదరటంలేదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి వారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలల్లోనే ఉంటారని అంచనా వేస్తున్నారు. పథకంలో సొమ్ములు వస్తాయనే ఆశతో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకుంటున్న వారి పరిస్థితిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవలసి ఉంది. గతంలో ఈ పథకంలో అర్హత పొందిన లబ్ధిదారులకు మాత్రం నిధులు వారి బ్యాంకు అక్కౌంట్‌లో జమ చేశారని చెబుతున్నారు. ఈ కొత్త పథకం అమలు ఎలా ఉంటుందనే దానిపై పూర్తిస్థాయిలో ఒక అంచనాకు రాలేక పోతున్నారు. ఈనెల 24 తరువాత కానీ ఎంతమంది అర్హులు దరఖాస్తులు చేసుకున్నారో అనేది తెలుస్తుంది.

క్రైమ్ కార్నర్

వేర్వేరు ప్రాంతాల్లో రెండు కుటుంబాలపై కట్నం కేసులు

టి.నరసాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న భర్త అతని కుటుంబీకులు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో గండిగూడెం గ్రామానికి చెందిన నల్లిబోయిన వాణికి ముసునూరు మండలం సూర్యపల్లి గ్రామానికి చెందిన నాగరాజుతో 2014లో వివాహమైంది. ఏడాదిగా భర్త నాగరాజు రోజూ మద్యం తాగి వచ్చి కొడుతూ, తిడుతూ శారీరకంగా, మానసికంగా కుటుంబీకులతో కలిసి వేధిస్తున్నాడని పెళ్ళి సమయంలో రూ. 10లక్షలు నగదు, 10 కాసుల బంగారం, ఎకరం పొలం కట్నంగా ఇచ్చినప్పటికీ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో టీచరుగా పనిచేస్తున్న మహిళ తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కట్టవపొదలవారి గూడెం గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకటలక్ష్మి జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బందెల మధు సూధనరావుతో 2021లో వివాహం జరిగింది. కట్నంగా రూ.4లక్షలు, రెండు లక్షల విలువైన సారె, పదికాసుల బంగారం, మోటారు సైకిల్ ఇచ్చారన్నారు. ఆ తర్వాత నుంచి అదనపు కట్నం తీసుకురావాలని ఆమె భర్త అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా భర్తతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారికి పాము కాటు

జీలుగుమిల్లి, డిసెంబరు, (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో మూడేళ్ల చిన్నారి ఆస్పత్రి పాలైన సంఘటన రాచన్నగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీ తాట్కూరుగొమ్ములో చోటు చేసుకున్నది. చిన్నారి ఆనంది ఇంటి వద్ద ఆడుతుండగా గురువారం రాత్రి గుర్తు తెలియని పాముకాటుకు గురైంది. కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స చేయకుండా పెద్దాసుపత్రికి వెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించటంతో వారు చిన్నారిని తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట వైద్యం నిమిత్తం తీసుకెళ్లారు. గిరిజన ప్రాంతంలో పాము కాటు ఇంజక్షన్లు పీహెచ్‌సీలో ఉంచినా సకాలంలో ప్రభుత్వ వైద్యం అందటం లేదంటున్నారు. ఆస్పత్రిలో వైద్యం విషయమై వైద్యాధికారి దివ్య మాట్లాడుతూ సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. కాలుమీద ఒక గాటు మాత్రమే ఉండటంతో చిన్న పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారన్నారు.

ఆటో ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి



పెనుమంట్ర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రులో ఆటో బైక్ ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన హరి(15) మృతి చెందాడు. మృతుడు వరి కోతలు కోసే మిషన్‌పై పని నిమిత్తం ఇక్కడికి వచ్చినట్లు అతని స్నేహితులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కొన ఊపిరితో ఉన్న హరిని 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పెనుమంట్ర ఎస్ఐ కె.స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియా వార్త అసత్యం: ఎస్ఐ



లక్కవరం పామాయిల్ తోటలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం సమీపంలో ఓ వ్యక్తిని కొందరు అపరిచిత వ్యక్తులు చెట్టుకు కట్టేసి చాకుతో ఒంటిపై కోసి, రాళ్ళతో కొట్టి, పిన్నీసులతో ఒళ్ళంతా పొడిచి చిత్రహింసలు పెట్టినట్లు వచ్చిన సోషల్ మీడియాలో వార్త అసత్యమని లక్కవరం ఎస్సై రామకృష్ణ తెలిపారు. గురువారం ఆ వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. చాలా సేపటివరకు ఈ విషయం ఎక్కడ జరిగిందో తెలుసుకోవడానికి పోలీసులకు కాస్త సమయం పట్టింది. మొత్తానికి ఈ వార్త అసత్యమని లక్కవరం పోలీసులు తేల్చారు. ఈ అసత్య వార్తను ప్రచారం చేసిన వ్యక్తి సింహాద్రి పెద్దిరాజును పోలీసులు అదుపులోకి తీసుకుని అతని నుంచి వివరాలు సేకరించారు. లక్కవరం గ్రామానికి చెందిన సింహాద్రి పెద్దిరాజు కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామంలో సమోసాలు అమ్ముతుంటాడు. గురువారం లక్కవరం దేవులపల్లి మధ్యలో పామాయిల్ తోట వద్ద సమోసాల డబ్బుల కోసం ఇద్దరు వ్యక్తులతో గొడవ పడ్డాడు. దీంతో గొడవ పడుతున్న ఇద్దరు పెద్దిరాజును గెంటగా మద్యం మత్తులో ఉన్న పెద్దిరాజు పక్కనే ఉన్న పామాయిల్ కొమ్మలపై పడిపోగా వాటికున్న ముళ్ళు గుచ్చుకుని చేతికి గాయాలయ్యాయి. ఇంటికి వెళ్ళిన తరువాత భయంతో తనను కొందరు అపరిచిత వ్యక్తులు కొట్టి చిత్రహింసలు పెట్టినట్లు చెప్పాడు తనపై జరిగిన దాడి అంతా అబద్ధమని పోలీసులతో చెప్పాడు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉదయాన్నే వాకింగ్ చేసిన ఒక వృద్ధురాలు చెరువు వద్దకు వెళ్ళికాళ్ళు, చేతులు కడుగుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందింది. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామానికి చెందిన కటారి తిరుపతమ్మ (72)కు భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రతి రోజు ఉదయాన్నే ఆమె గ్రామంలో వాకింగ్ చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కూడా ఆమె గ్రామంలో వాకింగ్ చేసి మంచినీళ్ళ చెరువు వద్ద కాళ్ళుచేతులు కడుగుతూ ప్రమాదశాత్తు జారి మృతి చెందింది. ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రైతుపై దాడి

పెదవేగి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తోటలో చెరకు గడలు దొంగిలించవద్దని చెప్పినందుకు ఆగ్రహించిన వ్యక్తులు రైతుపై దాడికి పాల్పడ్డారని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం ముండూరుకు చెందిన బలుసు రవికుమార్‌కు ముండూరు చిన దళితవాడ సమీపంలో చెరకుతోట ఉంది. గ్రామానికి చెందిన జాలాది సుధీర్, మరికొంతమంది కలిసి ఆ తోటలోని చెరకు గడలను దొంగిలించుకుపోతున్నారు. దీనిపై రవికుమార్ వారిని మందలించగా, బుధవారం సాయంత్రం తోటనుంచి ఇంటికి వెళ్తున్న బలుసు రవికుమార్‌ను సుధీర్, మరికొంత మంది కలిసి దాడిచేసి, కర్రలు, రాళ్ళతో గాయపర్చారు. గాయపడిన రవికుమార్‌ను స్థానికులు ఏలూరు ఆస్పత్రికి తరలించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పామాయిల్ ఖాళీ గెలలకు నిప్పు

రూ.లక్షన్నర నష్టం



పెదవేగి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గర అగ్నిప్రమాదం జరిగింది. ఆయిల్‌పామ్ ఖాళీ గెలల(బంచెస్)లకు నిప్పు అంటుకోవడంతో మంటలు భారీగా ఎగశాయి. అగ్నిమాపకశాఖాధికారులు రాత్రంతా శ్రమించి, మంటలను అదుపులోకి తెచ్చారు. పామాయిల్ ఫ్యాక్టరీలో గెలలనుంచి పండు తీసుకున్న తరువాత ఆ ఖాళీ గెలలను ఫ్యాక్టరీ ఆవరణ ఎదుట డంపింగ్ యార్డులో వేస్తారు. అక్కడ టన్నులకొద్ది పామాయిల్ వేస్ట్ ఉంది. కాగా బుధవారం రాత్రి పదకొండు గంటల సమయంలో డంపింగ్‌యార్డు నుంచి మంటలు వ్యాపించాయి. ఏలూరు అగ్నిమాపకశాఖాధికారులు రాత్రంతా మంటలను అదుపు చేయడానికి అవస్థలు పడ్డారు. డంపింగ్ యార్డులో పామాయిల్ వేస్ట్ దగ్గర మద్యం సీసాలు, వాటర్ బాటిల్స్, గ్లాసులు ఉన్నాయి. దీంతో ఎవ్వరో మద్యం తాగి, సిగరెట్ వంటివి వేసి ఉండవచ్చని, అది నిప్పురేగి, మంటలు వ్యాపించి, డంపింగ్ యార్డులో బంచెస్‌ను దగ్ధం చేసినట్లు గుర్తించామని మేనేజర్ సుధాకర్ తెలిపారు. జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ గురువారం ఉదయం ఫ్యాక్టరీని సందర్శించారు. దాదాపు లక్షన్నర రూపాయల ఆస్తి నష్టం ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఫ్యాక్టరీలో తరచుగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి.



నేచురల్ గ్యాస్ ప్రాజెక్ట్‌లపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ

ఏలూరు టూటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేచురల్ గ్యాస్ ప్రాజెక్టులపై ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్‌సింగ్ పూరి మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల స్థాపనను నిబంధనలు ఉల్లంఘిస్తున్న కంపెనీలను గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రీన్‌ఫీల్డ్, బ్రౌడ్‌ఫీల్డ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి చమురు, గ్యాస్, కంపెనీ నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు పర్యావరణం, అటవీ, కోస్టల్ రెగ్యులేటరీ జోన్, వన్యప్రాణుల సంరక్షణ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. భూసేకరణ, రహదారి మార్గం, వినియోగహక్కు, పేలుడు భద్రతకు సంబంధించిన అనుమతులు ప్రాజెక్టు నిర్వాహకులు తీసుకోవల్సి ఉంటుందన్నారు. ఆయిల్ అండ్ గ్యాస్ ప్రాజెక్టుల అమలు స్థితిని అంచనా వేయడానికి పటిష్టమైన ఆన్‌లైన్ మనిటరింగ్ సిస్టమ్ కలిగి ఉంటుందన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

ట్రైకార్ చైర్మన్‌కు వినతులు

బుట్టాయగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలపై ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుకు గురువారం వినతిపత్రాలు అందజేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. వీటిపై స్పందించిన చైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కేఆర్.పురం ఐటీడీఏ ఇంజనీరింగ్ ఈఈ లత, డీఈ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా చైర్మన్ కలిశారు.

జీవో ప్రకారం రజకులకు చెరువులు కేటాయించాలి

టి.నరసాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రజకులకు ప్రతిచోటా జీవో 343 ప్రకారం చెరువులు కేటాయించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి కోరారు. గుంటూరులోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. రవి మాట్లాడుతూ రజకులకు 343 జీవో ప్రకారం రజకులకు ప్రతిచోటా చెరువు కేటాయించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రజక సామాజిక వర్గాన్ని పట్టించుకోలేదని, జీవోలను కూడా అమలు చేయలేదన్నారు. జీవో 25 ప్రకారం ప్రతి మూడు నెలలకు కలెక్టర్ అధ్యక్షతన రజక సంక్షేమ కమిటీ సమావేశం జరపాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల ఒక్క సమావేశం కూడా జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిన రజక సామాజిక వర్గం ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని జీవోలుకు కృషి చేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే రజక సామాజిక వర్గం తరపున శాసనసభలో సమస్యలు ప్రస్తావించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళతామని హామీ ఇచ్చారని తెలిపారు.



మంత్రి లోకేశ్‌ను కలిసిన దుర్గాప్రసాద్

బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను దుర్గాప్రసాద్ గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, తరువాత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, ఇకనైనా కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో బ్రాహ్మణులకు తగు ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారని సత్యవాడ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

వీఆర్వోలపై అధికారుల ఒత్తిడి

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలను అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారని రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు అవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడితో తూర్పుగోదావరి జిల్లా కనుపూరు వీఆర్వో సత్తిబాబు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అధికారుల తీరును ఉన్నతాధికారులకు తెలియజేసినా మార్పు లేదన్నారు. అధికారుల వైఖరి మారకుంటే తూర్పు గోదావరి జిల్లాలో వీఆర్వోలు విధులు బహిష్కరిస్తారని రవీంద్రరాజు హెచ్చరించారు.







బుట్టాయగూడెం, ఏలూరులో ఓటేయడానికి బారులు తీరిన ఉపాధ్యాయులు, కొయ్యలగూడెంలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకట రమణ

ఉత్సాహంగా ఓటేశారు

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉపాధ్యాయులు అధిక శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియను జిల్లా, డివిజన్, మండల రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు.

బుట్టాయగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 302 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ సీహెచ్.చలపతిరావు తెలిపారు. బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 339 మంది ఓటర్లకు 302 మంది ఓటు వేశారన్నారు.

● దెందులూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77 ఓట్లు ఉండగా 67 ఓట్లు పోలయ్యాయి.

● లింగపాలెం: మండలంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 48 మంది ఓటర్లకు 46 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు తహసీల్‌దార్ నజీముల్లాషా తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు.

● టి.నరసాపురం: మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 35 ఓట్లు ఉండగా 32 మంది ఓటు వేశారు.

● పెదవేగి: మండలంలో 64మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 65మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 64 మంది ఓటు వేశారు. ఎన్నికల అధికారి ఎన్డీ భ్రమరాంబ ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షించారు.

● పెదపాడు: స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 72 ఓట్లలో 53 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నిక ప్రక్రియను డీఎస్పీ కేవీవీఎన్‌వీ.ప్రసాద్, సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సై సతీష్, తహసీల్దారు కృష్ణజ్యోతి పర్యవేక్షించారు.

● పోలవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 103 ఓట్లకు గాను 94 ఓట్లు పోలయ్యాయి. 90 శాతం ఓటింగ్ నమోదైంది. డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● కామవరపుకోట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కామవరపుకోట మండలంలో 55 మందికి 51 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఆర్ఐ రామకృష్ణ చెప్పారు.

● చింతలపూడి: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ హైస్కూలు పోలింగ్ బూత్‌లో 232 ఓట్లకు 215 ఓట్లు పోలయ్యాయి. 92.67 శాతం పోలింగ్ నమోదైంది.

● ఉంగుటూరు: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 69 ఓటర్లకు 64 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ వై.పూర్ణ చంద్రప్రసాద్ తెలిపారు.

● కుక్కునూరు: మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం ఆరు ఓట్లు ఉన్నాయి. ఉదయం 10 గంటలలోపే ఆరుగురు ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

● భీమడోలు: మండలంలో మొత్తం 91 ఓటర్లకు 85 పోలయ్యాయి. 93.41 శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాన్ని సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పరిశీలించారు.

● జంగారెడ్డిగూడెం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 273 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 262 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 95.97 శాతం పోలింగ్ నమోదైంది. ఆర్డీవో ఎంవి.రమణ స్థానిక పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. డీఎస్పీ యు.రవిచంద్ర పోలింగ్ కేంద్రం వద్ద భద్రతను పర్యవేక్షించారు.

● ద్వారకాతిరుమల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 69 ఓట్లకు 63 మంది ఓటేశారు. 91శాతం పోలింగ్ నమోదైనట్లు పీవో జెవి సుబ్బారావు తెలిపారు.

● జీలుగుమిల్లి: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 70మంది ఓటు హక్కు కలిగి ఉండగా 67మంది ఓటు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు బి.సందీప్, కిశోర్, ఎస్సై నవీన్‌కుమార్ పరిశీలించారు.

● కొయ్యలగూడెం: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో వెంకటరమణ, తహసీల్దార్ చెల్లన్న దొర పరిశీలించారు. మొత్తం 113ఓట్లుకు 107మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 94.62శాతం నమోదైందని తహసీల్దార్ తెలిపారు. ఎస్సై చంద్రశేఖర్ పోలింగ్ కేంద్రం వద్ద భద్రతలను ఏర్పాటు చేశారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే బడేటి చంటి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో గురువారం వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలున్న నేరుగా తన వద్దకు రావాలన్నారు. ఏ సమయంలోనైనా తాను అందుబాటులో ఉంటానన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ నెల 6న భారతరత్న బీఆర్.అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి దళిత సంఘాల నేతలు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో చోడే వెంకట రత్నం, జాలా బాలాజీ, జాలా సుమతి, త్రిమూర్తులు, ఆర్.రాంబాబు, సీహెచ్.వెంకటరమణ, రెజ్వాన సుల్తానబేగం పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆదివాసీ క్రిష్టియన్ పాస్టర్స్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు కేక్ కట్‌చేసి పాస్టర్లకు అందజేశారు. క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ప్రపంచ మానవాళికి ఏసు క్రీస్తు శాంతి, సహనాన్ని, ప్రేమను చూపించారని, అదేమార్గంలో అందరూ నడవాలన్నారు. క్రీస్తు బోధనలు సర్వమానవాళి ఆచరించదగినవన్నారు. ప్రజలందరిని ప్రేమతో చూడాలని, అన్ని మతాలు సమానమేనని సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. క్రిస్టియన్లకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. క్రిస్టియన్లకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జాతీయ ఐక్య వేదిక అధ్యక్షుడు కుర్సం నిరీక్షణరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఉయికె ఏలియా, తెలంగాణ బిషప్ కర్రి యోహను, కన్వీనర్ గుండి ఫిలిప్, సలహాదారు మడి జోషప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఏలియా, ఏపీ, తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ క్రిష్టియన్ పాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి లబ్ధిదారుడికి చెక్ అందజేత

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన యువకుడి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి అందజేసిన మొత్తంపై చెక్‌ను ఎమ్మెల్యే రోషన్ కుమార్ గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన మహమ్మద్ మున్వర్ కుమారుడు మహ్మద్ ఫయాజ్ నోయిడా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మే 8న ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. మూడుసార్లు ఆపరేషన్‌కు రూ.25 లక్షలు ఖర్చయింది. టీడీపీ నేత షేక్ ముస్తఫా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పరిస్థితి వివరించారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం సహాయ నిధి నుంచి రూ.11 లక్షలు మంజూరు చేశారు. చెక్కును చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోష న్‌కుమార్ అందజేశారని ముస్తఫా తెలిపారు. బాధితుడి కుటుంబానికి ఆసరాగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, నంబూరి రామచంద్రరాజు, పెనుమర్తి రామకుమార్, తూటిగుంట రాము, అల్లూరి రామకృష్ణ, షేక్ యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేథలిక్ న్యాయవాదుల జాతీయ సదస్సు

ఏలూరుటూటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేథలిక్ గురువులు, న్యాయవాదుల సదస్సు శుక్రవారం జరుగుతుందని సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఇమ్మానియేలు తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన గురువులు 130 మంది ఏలూరుకు వస్తున్నారన్నారు. ఏలూరు బిషప్, విశాఖ అగ్రపీఠ పాలనాధికారి బిషప్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 3రోజుల పాటు సెయింట్ జోసఫ్ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఒంగోలు సెషన్స్ జడ్జ్ దున్నా రాములు, ఏలూరు బార్ సభ్యులు కె.సీతారామ్, రూనాల్డ్‌రాజు, ఇస్సాక్ మోహన్‌లాల్ పాల్గొంటారన్నారు.





ఏలూరులో శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, స్వామి, అమ్మవార్లు

షష్ఠి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు షష్ఠి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆలయ పరిసరాలను శుభ్రంచేసి ఆలయాలకు రంగులు వేశారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించేందుకు వేదికలు ఏర్పాటు చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు క్యూలైన్లు, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవాలయాలకు విద్యుత్ తోరణాలను అలంకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి తిథి శుక్రవారం ఉదయం 10.48 గంటలకు ప్రవేశించి శనివారం ఉదయం 9.25 గంటల వరకు ఉంటుందని అర్చకులు ఉటుకూరి సాయిబాబా శర్మ తెలిపారు.

● కామవరపుకోట: శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద, కొత్తూరు, రావికంపాడు, తడికలపూడి, కళ్ళచెరువు గ్రామాల్లో ఆలయాల వద్ద షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ అలంకరణ చేశారు. కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్: నగరంలోని ఆదివారపుపేట షిరిడీసాయి ప్రేమ మందిరం వద్ద భక్తులు బాబాకు విశేష పూజలు చేశారు. బాబాకు అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. విశేష అలంకరణ, పంచ హారతుల అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం పల్లకీ సేవకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వన్‌టౌన్, టూటౌన్‌లో షిరిడీ సాయి మందిరాల వద్ద భక్తులు పూజలు చేశారు.

భూముల సంరక్షణకు చర్యలు చేపట్టాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఏవో ముత్యాలరావు

బుట్టాయగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూములను సంరక్షణపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు అన్నారు. విప్పలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో గురువారం ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 5న ప్రపంచంలోని అన్ని దేశాలు నేల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆహార భద్రత, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలు, మానవ శ్రేయస్సుకు నేల నాణ్యత, ప్రాముఖ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు భార్గవి, దీపక్ విద్యార్థులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవ కార్యక్రమం ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగింది. వివిధ రకాల నేలల గురించి వాటి ప్రాధాన్యతను గూర్చి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులు పాటించాలి

లింగపాలెం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో నూతన పద్ధతులు పాటించాలని ఏవో కోటగిరి మురళీకృష్ణ అన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు కొత్త పంటలపై దృష్టిసారించాలన్నారు. మినుము, పెసర, కందులు వంటి అపరాల సాగుతో లాభాలు పొందవచ్చని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సరిపడా గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, రైతుల నుంచి ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామన్నారు. ఆయనతో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే ప్రాంతాలు క్షేత్రస్థాయి పరిశీలన

పెదపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని సెంట్రల్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ (మంగళగిరి) టి.శ్రీనివాసురెడ్డి తెలిపారు. నందికేశ్వరపురం, రాజుపేట, తోటగూడెం గ్రామాల్లో రీసర్వే ప్రాంతాలను సర్వే ఏడీ ఎండీ అన్సారితో కలిసి గురువారం పరిశీలించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామసభల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండల సర్వేయరు కోదండరాం, గ్రామ సర్వేయర్ ప్రమోద్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏలూరు బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

ఆర్టీసీ ప్రయాణికులకు

మెరుగైన సేవలందిస్తాం

విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని విజయవాడ జోన్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు చెప్పారు. విజయవాడ జోనల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొదటిసారిగా ఏలూరు కొత్తబస్టాండ్‌ను గురువారం ఆయన పరిశీలించి ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బస్టాండ్‌లలో టాయిలెట్స్‌కు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉందని, వాటిని మెరుగుపరుస్తామన్నారు. ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు ఇతర ఉద్యోగాలు 7200 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. తక్కువ చార్జీతో ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని అందించేది ఆర్టీసీ అన్నారు. త్వరలోనే ఏలూరు డిపో నుంచి తిరుపతికి స్లీపర్ కోచ్ బస్సులను రెండు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఏలూరు నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు మరో సర్వీసు నడపడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇటీవల తూర్పు గోదావరి జిల్లా వాడపల్లి వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి ఇప్పటికే వంద బస్సులను తిప్పుతున్నామన్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడ నుంచి 20, ఏలూరు నుంచి 10, భీమవరం నుంచి 10, తూర్పుగోదావరి జిల్లా నుంచి 60 బస్సులను నడుపుతున్నామన్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులను పెంచనున్నామన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కోస్తా జిల్లాలకు అదనపు సర్వీసులను నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు నుంచి జనవరి 9న 21 సర్వీసులు, 10న 30 సర్వీసులు, 11న 30 సర్వీసులు, 12న 30 సర్వీసులు, 13న 6 సర్వీసులను మొత్తం 117 బస్సులను హైదరాబాద్ నుంచి ఏలూరుకు నడుపుతున్నామన్నారు. ఏలూరు నుంచి తిరుగు ప్రయాణానికి 15న 10 బస్సులు, 16న 15 బస్సులు, 17న 8, 18న 20, 19న 30, 20న 10 బస్సులు మొత్తం 93 బస్సులను నడుపుతున్నామన్నారు. ప్రజల అవసరానికి అనుగుణంగా అద్దె బస్సులను కూడా అదనపు సర్వీసులుగా వినియోగిస్తామన్నారు.

గత ఐదేళ్లలో ఆర్టీసీ వివక్షకు గురైందని ఆర్టీసీ కార్మికుల ఆశలు అడియాశలు అయ్యాయని, ఆర్టీసీ ఆస్తులను కారు చౌకధరలతో ధారాదత్తం చేశారన్నారు. ఆర్టీసీని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుతోపాటు, ఆర్టీసీ ప్రజా రవాణా జిల్లా అధికారి ఎన్‌విఆర్ వర ప్రసాద్, ఏలూరు డిపో మేనేజర్ బి వాణి పలువురు పాల్గొన్నారు.



కాల్వలో తూరల ఏర్పాటు పనులు

వంతెన పనులు వేగవంతం

దెందులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుండుగొలను శివారు శింగవరం వంతెన పనులను కాంట్రాక్టర్, అధికారులు వేగవంతం చేశారు. 'గుండుగొలను వంతెన నిర్మాణం అసంపూర్తి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 4న ప్రచురితమైన వార్తపై అధికారులు, కాంట్రాక్టర్ స్పందించారు. వంతెన పనులకు 3 భారీ క్రేన్‌లను సిద్ధం చేశారు. వంతెన నిర్మాణ పనులతో సాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా నిర్మాణ ప్రాంతం వద్ద కాల్వలో తూరలను ఏర్పాటు చేస్తున్నారు. మరో పక్క వంతెన నిర్మాణ పనులు గాడిలో పెట్టారు.

జనసేనలోకి పలువురి చేరిక

ఏలూరు రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నేత, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయాలతో ఆకర్షితులై షేక్ పరీద్ కాశీం ఆధ్వర్యంలో ఏసు, బుజ్జి, నాగరాజు, ధనరాజు, దాదాపు 20 మంది జనసేన పార్టీలో చేరారన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని పేర్కొన్నారు.

ఏకలవ్య విద్యార్థినికి అస్వస్థత

బుట్టాయగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విప్పలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో 8వ తరగతి విద్యార్థిని కుర్ల హేమలత అస్వస్థతకు గురైంది. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మూడు రోజులుగా చికిత్స పొందుతోంది. బాలిక ఆరోగ్యం మెరుగుపడిందని వైద్యాధికారి వసుంధర తెలిపారు. ఇటీవల హేమలత టైఫాయిడ్ బారిన పడిందన్నారు. చికిత్స అనంతరం పాఠశాలకు వెళ్లిందన్నారు. తిరిగి అస్వస్థతకు గురవడంతో చికిత్స అందిస్తున్నామన్నారు.

తక్షణం రోడ్లు నిర్మించాలి

టి.నరసాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధ్వానంగా ఉన్న అంతర్గత, లింక్‌రోడ్లు వెంటనే నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. ప్రధాన రహదారులు అధ్వానం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. టి.నరసాపురం-మక్కినవారిగూడెం -ముర్రిగూడెం, టి.నరసాపురం- అప్పలరాజుగూడెం, టి.నరసాపురం-బంధంచర్ల, మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం రోడ్లపై ప్రయాణం నరకప్రాయం అన్నారు. కొన్నిచోట్ల కంకరపోసి వదిలేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నిర్మాణం చేపట్టలేదన్నారు. తక్షణమే మండలంలో రోడ్లన్ని నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ నుంచి క్రాంతికుమార్ బహిష్కరణ

ఏలూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.క్రాంతికుమార్‌ను సంఘం నుంచి బహిష్కరించారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అభియోగాలపై బహిష్కరించినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని, ప్రధానకార్యదర్శి ఎస్.మహర్షి గురువారం తెలిపారు. విద్యార్థులు, విద్యాసంస్థలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాలు

ఉంగుటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఉంగుటూరు అనాథాశ్రమానికి గురువారం నిత్యాసరాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ హెప్సీబా, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డియ్య, కార్మేలు హైస్కూలు సిస్టర్ జీవా, కొండా రవి, నిర్మల జ్యోతి, ఆయేషా, బాబూరావు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపుపై ఎక్సైజ్ దాడి

ఉంగుటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ కారణంగా నారాయణపురంలో మూసివేసిన మద్యం దుకాణం పక్కనే మద్యం విక్రయాలు సాగుతున్నాయి. మంగళగిరి నుంచి వచ్చిన ఎక్సైజ్ ప్రత్యేక బృందం బుధవారం సాయంత్రం దాడి చేసింది. 765 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఒకరిని అరెస్ట్ చేసినట్లు భీమడోలు ఎక్సైజ్ సీఐ ఎస్.సత్యనారాయణ తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుక

భీమడోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలసానపల్లి గ్రామంలోని ఏసుకృత సన్నిధి చర్చిలో మండల పాస్టర్స్, యునైటెడ్ ఆధ్వర్యంలో సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్యాండిల్ లైట్ల సర్వీస్, కేక్ కటింగ్, ఫాదర్లకు నూతన వస్త్రాల బహూకరణ, తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అసోసియేషన్ ప్రెసిడెంట్ జివి రత్నం,సెక్రటరీ ఏసయ్య, ట్రెజరర్ విశ్వారావు, గౌరవాధ్యక్షుడు ఇంజేటి విజయ అచ్యుతం పాల్గొన్నారు.

మానవత సహాయం

భీమడోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అనారోగ్యం, ప్రమాదాల బాధితులకు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితురాలు కుసుమకు బియ్యం, నిత్యావసరాలు, రూ.3 వేలు, గుండుగొలనులో చైతన్య కృష్ణకు రూ.5 వేలు, క్యాన్సర్ బాధితురాలు నడిపల్లి నీలిమాదేవికి రూ.10 వేలు అందజేశారు. చైర్మన్ నూకరాజు, అప్పారావు, శ్రీనివాసరావు, రమణమూర్తి, కరణం పెద్దిరాజు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

రామాలయంలో ఉత్తర ద్వారం నిర్మాణం



రాతి ధర్వాజ ఏర్పాటు చేస్తున్న దాతలు

చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చనుబండ శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం నిర్మాణంలో భాగంగా గురువారం దాతలు రాతి ధర్వాజాను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. 1980లో దాత కొత్త గుండ్ల ప్రసాద్ ఉత్తర ద్వారాన్ని నిర్మించగా శిథిలావస్థకు చేరింది. దీనితో చనుబండకు చెందిన కొత్త గుండ్ల రాంబాబు జ్ఞాపకార్థం ఆయన భార్యా నిర్మల కుమారి, కుమారులు కృష్ణ సుధీర్, వంశీకృష్ణ, రాజ్ గోపాల్ రూ.8 లక్షల ఖర్చుతో నూతనంగా ఉత్తర ద్వారం నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



పోలవరంలో కల్లాల్లపై ఉన్న ధాన్యం

మబ్బుల వాతావరణం.. రైతుల కంగారు

చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల నుంచి మబ్బుల వాతావరణంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మండలంలో ఇంకా సుమారు వెయ్యి ఎకరాల్లో వరి కోతలు జరగాల్సి ఉంది. పోలవరం, చీపురుగూడెం, కోటపాడు, మర్లపాలెం తదితర గ్రామాల్లో కల్లాల్లో ధాన్యం భారీగా ఉంది. ఈ పరిస్థితి లో వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు భయపడుతున్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



ముసునూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల గ్రామ పంచాయితీ శివారు అన్నవనేని వారిగూడెం అడ్డరోడ్డులో తాగునీటి కోసం మహిళలు గురువారం ఆందోళన చేశారు. సుమారు 20 కుటుంబాలకు తాగు నీటి సౌకర్యం కోసం ఇక్కడ ఉన్న చేతి పంపు మరమ్మతుకు గురై ఐదు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు, ఇతర అవసరాలకు ఈ చేతి పంపు అధారమని, కిలో మీటరు దూరంలో ఉన్న వ్యవసాయబోర్లు వద్దకు వెళ్ళి నీరు తెచ్చుకుంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చెక్కపల్లిలో ఉపాధ్యాయుల నిరసన

ముసునూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రాయచోటి మండలం కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుడిపై దాడిచేసిన ఘటనపై చెక్కపల్లి జడ్పీపాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల ప్రధాన కార్యాదర్శి గుడిమళ్ళ రాంబాబు మాట్లాడుతూ తరగతి గదిలో కొంత మంది విద్యార్థులు ఘర్షణ పడుతుండగా ఉపాధ్యాయుడు అహ్మద్ అది తప్పని చెప్పినందుకు విద్యార్థులు అతనిపై దాడిచేయడం, ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. నిరసనలో హెచ్‌ఎం అబ్బాస్, సీనియర్ ఉపాధ్యాయులు రాజశేఖర్, కళాధర్, పద్మావతి పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



ముసునూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడు రేషన్ దుకాణంలో బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఏలూరు విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో 50కేజీల పంచదార, 100కేజీల కందిపప్పు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన సరుకులను సీజ్ చేసి, సదరు రేషన్ డీలర్‌పై 6(ఏ) కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ తనిఖీల్లో నూజివీడు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ డేను ఘనంగా జరపాలి: ఎంఈవో



ముసునూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 7వ తేదీన నిర్వహించతల పెట్టిన మెగా పేరెంట్స్ డేను ఘనంగా జరపాలని ఎంఈవో బి.వి.యస్ సుబ్బారావు అన్నారు. ముసునూరులో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 62 పాఠశాలల్లో మెగా పేరేంట్స్ డే నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

రైతు కుటుంబానికి సాయం



చాట్రాయి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం పాల సహకార సంఘానికి పాలు పోసే గంధ్రాల సుబ్బారావు ఇటీవల మృతి చెందగా కృష్ణామిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం కింద రూ.50 వేల చెక్కును గురువారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు మృతుని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నేల దినోత్సవం

నూజివీడు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుక్కులూరు రైతు సేవా కేంద్రంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నూజివీడు ఏడీఏ జి.విద్యాసాగర్ మాట్లాడుతూ నేలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో చాముం డేశ్వరి, ఎం.సూరిబాబు, పాల్గొన్నారు.

నాన్‌స్టాప్ ప్రయత్నం!

ఒకప్పుడాయన కాంగ్రెస్‌లోను, ఆ తరువాత వైసీపీలోను తిరుగులేని నేతగా ఉన్నారు. ఏలూరు కేంద్రంగా ఆయన 1999 నుంచి ప్రతిసారి అసెంబ్లీ బరిలోకి దిగి మూడుసార్లు గెలుపొందారు. జగన్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవితో ఉమ్మడి జిల్లానే దాదాపు శాసించారు. కాని రాజకీయాల్లో అదృష్టం కలిసొచ్చి ఇన్నాళ్ళు ఆయన ఆడిందే ఆట.. పాడిందే పాట. అలాంటి నేత ఒక్కసారిగా వైసీపీ నుంచి రాజీనామా చేయడమే కాకుండా ఇకముందు క్రియాశీలక రాజకీయాల్లో నేనుగాని, నా కుటుంబంగాని ఉండరంటూ వీర శపథం చేశారు. కాని ఎందుకో.. ఏమో ఆయన మనస్సు మార్చుకున్నారు. సైకిలెక్కేందుకు ఉబలాటపడుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా ఎడతెరపిలేకుండా చేస్తున్న ఆయన ప్రయత్నాలకు తెలుగు తమ్ముళ్ళు ససేమిరా వీల్లేదంటూ మోకాలడ్డారు. నాని టీడీపీలో చేరాలన్న తన నాన్‌స్టాప్ ప్రయత్నాలు సక్సెస్ అవుతాయా, విఫలమవుతాయో మరికొద్ది రోజుల్లోనే తేలబోతుంది.

- నాని టీడీపీలో చేరికకు ఎందుకింత ఆదుర్దా
- కేడర్ వ్యతిరేకిస్తున్నా బెజవాడలోనే మకాం
- ఇంకా ముహూర్తం ఖరారు చేయని టీడీపీ
- ఆచితూచి నిర్ణయానికి మొగ్గు
- సీఎం చంద్రబాబుకు అన్నీ వివరించిన ఎమ్మెల్యే చంటి
- శనివారం జరగాల్సిన భేటి వాయిదా?



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాధారణంగా ప్రభుత్వాలు మారినప్పుడల్లా అప్పటిదాకా అధికార పార్టీలో ఓ వెలుగు వెలిగిన వారంతా అమాంతం ప్లేటు తిప్పేస్తారు. కొత్త పార్టీల్లోకి జంప్ చేస్తారు. సీనియర్లకైతే ఎలాంటి అడ్డంకులు లేకుండా అన్ని పార్టీలు తలుపులు బార్లా తీసి ఉంచుతాయి. అదీ ప్రత్యేకంగా బలమైన సామాజిక వర్గనేతలైతే ఇక చెప్పనక్కర్లేదు. ఎదురేగి మరీ స్వాగతం పలుకుతారు. ఈ వ్యవహారం మాత్రం సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానికి మాత్రం రివర్స్ అయ్యింది. ఆయన లోపాయికారిగా కొందరి ప్రయత్నాలతో టీడీపీ వైపు తొంగి చూశారు. ఆయనను ఏదొక రూపంలో పార్టీలోకి రప్పించేందుకు కొందరు నేతలు తెరవెనుక చక్రం తిప్పారు. టీడీపీ అధినాయకత్వాన్ని ఒప్పించి పని చక్కబెట్టేందుకు అంతరంగం సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలోనే నాని చేరిక దాదాపు ఖరారైంది. అంతలోనే ఆయన చాన్నాళ్ళుగా ఏలిన ఏలూరులో టీడీపీ కేడర్ ఒక్కసారిగా రివర్స్ అయ్యింది. ఆయనేంటి.. పార్టీలోకి తీసుకోవడం ఏమిటంటూ ఏకంగా పార్టీ అధినాయకత్వానికి పుంకానుపుంకాలుగా ఫిర్యాదులు పంపారు. సోషల్ మీడియాలో ఆళ్ల నాని రాకను అపహాస్యం చేస్తూ పోస్టులు పెట్టారు. ఆయన ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండగా వైసీపీకి పూర్తి న్యాయం చేసేందుకు తెలుగు దేశం కేడర్‌ను అన్ని విధాలా దెబ్బతీసి తొక్కేయడానికి ప్రయత్నించిన సంఘటనలను వరుసగా పేర్కొంటూ కొన్ని వీడియోలను కూడా తెలుగు దేశం అధిష్టానానికి చేరవేశారు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే మంగళవారం నాడే నాని టీడీపీలో చేరిక జరిగిపోయి ఉండేది. కాని దీనికి విరుద్ధంగా అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. మిగతా నియోజకవర్గాల్లో మాదిరిగానే ఏలూరులో కూడా వైసీపీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హోదాలో నాని చేరిక సులభతరమే అనుకున్నారు. అంతకుముందు ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ చైర్మన్‌ను, ఏలూరు నగర మేయర్‌ను, మరికొంతమంది కార్పొరేటర్లను అలవోకగా టీడీపీలో ఆహ్వానించడమే కాకుండా వారిని సగౌరవంగా పార్టీలో చేర్చుకుని సముచిత స్థానం ఇచ్చారు. అదీకాక రెండు దశాబ్దాలకుపైగా రాజకీయంగా ఓ వెలుగు వెలిగిన ఆళ్ల నాని విషయంలో ఎలాంటి అడ్డంకులు ఉండబోవని భావించినా దీనికి విరుద్ధంగానే టీడీపీలో కొత్త కొత్త సమస్యలు తలెత్తాయి.

వస్తే.. అవమానమే..

తెలుగుదేశం కేడర్ నిర్ణయానికి భిన్నంగా పార్టీ అధినాయకత్వం ఆళ్ల నానిని పార్టీలో చేర్చుకున్నా ఆ తరువాత ఆయనకు అవమానాలు తప్పవంటూ ఏకంగా తెలుగుదేశం సీనియర్ నేతలు కొందరు వ్యక్తిగత సందేశాలు పంపారు. ఏలూరులో ఎమ్మెల్యేగా, వైసీపీ నేతగా మీరు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు.. అప్పుడేమో కారుకూతలు, ఇప్పుడేమో నీతి కబుర్లా అంటూ ఎద్దేవా చేశారు. ఇలాంటి తరుణంలోనే మంగళవారం ఆళ్ల నాని చేరిక కాస్తా వాయిదా పడింది. సీనియర్ అయిన ఆళ్ల నాని తొలిసారిగా ఇలాంటి చేదు అనుభవం ఎదుర్కొంటున్నారు. ఆయన విజయవాడలోని ఒక ప్రముఖ హోటల్‌లో మకాంవేసి టీడీపీ నుంచి ఎప్పుడు కబురొస్తుందా అని ఏకంగా మూడు రోజుల నుంచి ఎదురుచూస్తూనే వచ్చారు. ఆయనను పార్టీలోకి చేర్చేందుకు చక్రం తిప్పిన నేతలు.. అందుబాటులో ఉండండి ఎప్పుడైనా మీకు కబురు రావొచ్చంటూ ఇచ్చిన సందేశాలతోనే ఆళ్ల నాని విజయవాడలో మకాం వేశారు. కాని సీనియర్ నేత క్రియాశీలక రాజకీయాల్లో ఉండనని చెప్పి మళ్ళీ ఇలా పడిగాపులు పడాల్సిన స్థితికొచ్చారంటూ ఏలూరులో కామెంట్లు వినిపిస్తున్నాయి. ఉన్నన్నాళ్ళు తిరుగులేకుండా కథ నడిపి ఇప్పుడు టీడీపీలో చేరేందుకు ఎందుకు పాకులాడాల్సి వచ్చిందంటూ ఆయనకు ఒకప్పటి సన్నిహితులు కాస్తంత చీత్కార ధోరణిలోనే ఉన్నారు. కాని టీడీపీలోకి చేరడానికి బలమైన కారణమే ఉందని, అందు కోసమే పార్టీలోకి చేరేందుకే ఇప్పుడు అనేక మెట్లు దిగి ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని మరికొందరు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఏలూరు ఎమ్మెల్యేల బడేటి చంటి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆళ్ల నాని పార్టీలోకి రాక విషయాన్ని ప్రస్తావిస్తూ పార్టీ కేడర్ వద్దంటున్నారు. వాళ్ళిష్టమే నా ఇష్టం కూడా. కాని మీరన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకుంటారనుకుంటున్నామని తమ అభిప్రాయాన్ని సీఎం చెవిన వేశారు. ఈనెల 9న జరగాల్సిన సీఎంతో పార్టీ నేతల భేటీ దాదాపు జరగకపోవచ్చునని సంకేతాలు అందుతున్నాయి. బడేటి కుటుంబం సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉండడమే కాకుండా ప్రతిసారి ముక్కుసూటిగానే వ్యవహరిస్తుంది. నాని రాక విషయంలోను అదే జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు సీనియర్ నేత, మంత్రి అచ్చెన్నాయుడును, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును కలిసి పార్టీ కేడర్ ఏమనుకుంటున్నారో, ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సోదాహరణంగా వివరించినట్టు సమాచారం.

111 మంది ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల తొలగింపు

సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు పయనమైన ఉద్యోగులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్హతలున్నప్పటికీ మెరిట్‌లేకుండా పొందుతున్న ఉద్యోగ నియామకాలు చెల్లవంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్యఆరోగ్యశాఖ గతంలో జరిపిన రిక్రూట్‌మెంట్‌లో నియామకాలు పొందిన 111 మంది కాంట్రాక్టు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ(టెర్మినేట్) డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్యఆరోగ్యశాఖలో 2002లో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ) నియామకాలు జరిగాయి. ఈ ఉద్యోగాలకు విద్యార్హతల విషయంలో విడుదలైన రెండురకాల జీవోల్లో అస్పష్టత నెలకొనడంతో ఇంటర్మీడియట్, పదోతరగతి విద్యార్హతలతో నియామకాలు పొందినవారి మధ్య ఒకింత వివాదం ఇప్పటికీ కొనసాగుతోంది. జీవోల్లో లొసుగులను అడ్డుపెట్టుకుని కోర్టు ఉత్తర్వులతో ఉద్యోగాలు పొందుతున్నవారు ఇప్పటికీ ఉన్నారు. మెరిట్‌లేకుండా ఉద్యోగాలు చేస్తుండటం, ఆ మేరకు జీవోల్లో నియామ కాలకు సహేతుకతను సవాల్‌చేస్తూ ఒకరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం తీర్పును వెలువరిస్తూ నిర్దేశిత జీవోల్లో వివాదానికి కారణమైన, సహేతుకతలేని జీవో 1207ని కొట్టివేస్తూనే ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నవారిలో మెరిట్ ప్రకారం రిక్రూట్ అయిన వారిని కొనసాగించే విషయాన్ని పరిశీలించాలని గతనెల 29న ఇచ్చిన తుదితీర్పులో ఆదేశించింది. తీర్పుపై అప్పీల్‌కు మూడు నెలలు గడువునిచ్చింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతం ఉద్యోగాల్లోవున్న 111 మంది కాంట్రాక్టు ఎంపీ హెచ్‌ఏ (మేల్)లను విధులనుంచి టెర్మినేట్ చేయడానికి డీఎంహెచ్‌వో కార్యాలయం ఉత్తర్వులను జారీచేసింది. నియామకం, పునర్నియామకం కింద రెండు విధానాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో జీవో 1207 ద్వారా ఉద్యోగాలు పొందిన 69మంది, మరో 42 మందిని టెర్మినే ట్‌చేస్తూ సంబంధిత ఉద్యోగులను ఉటంకిస్తూ రెండు రకాల టెర్మినేట్ జాబితాలను డీఎంహెచ్‌వో జారీ చేశారు.



సింగరాయపాలెం సదస్సులో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సీఐ

కలిదిండి/ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రవికుమార్ అన్నారు. కలిదిండి పోలీస్ స్టేషన్‌లో గురువారం సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలోను సీసీ కెమెరాల ఉపయోగాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.



హరిప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

హరిప్రసాద్‌కు ఉత్తమ పరిశోధనకుడి అవార్డు

కైకలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న మంగళగిరి హరిప్రసాద్‌కు కోయంబత్తూరులో నాలెడ్జ్ రీసెర్చ్ అకాడమి నుంచి ఉత్తమ పరిశోధకుడి అవార్డు రావడం అభినందనీయమని ప్రిన్సిపాల్ వైశ్రీలత అన్నారు. గురువారం హరిప్రసాద్‌ను కళాశాలలో సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాశ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

కైకలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కైకలూరు కోర్టులో ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని రాజీ చేసుకోదగ్గ కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మీ గురువారం తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్లేనన్నారు. కైకలూరు సీనియర్, జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులలో ఉన్న కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేటి నుంచి షష్ఠి ఉత్సవాలు



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి స్వామి వార్షిక షష్ఠి కల్యాణోత్సవాలు ప్రారంభమై ఈనెల 18 వరకు జరుగుతాయి. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పర్యవేక్షణలో దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 6న స్వామిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. 7న పుట్టలో పాలుపోసి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఉత్సవాలను ప్రారంభిస్తారు. అదేరోజు రాత్రి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణం, 8న మార్గశిరశుద్ధ సప్తమి పూజలు, 9న కల్యాణ రథయాత్ర, 10న తెప్పోత్సవం, 11న సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, 12న అష్టోత్తర శత కలశార్చన, 13న సుబ్రహ్మణ్య హవనం, 14న వేద సభ సదస్యం, 15న త్రిశూలేశ్వరస్వామి స్నపనం, 17న ఏకనామ సంకీర్తన, 18న అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి తెలిపారు.

పెదలంకలో..

కలిదిండి : పెదలంకలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి 15 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు మాజీ వీఆర్వో అడివి రామదాసు దంపతులచే స్వామికి అఖండ దీపారాధన, అష్టోత్తర పూజ, 7న తెల్లవారుజామున మాజీ పంచాయతీ కార్యదర్శి పోకల వెంకటేశ్వరరావు దంపతులచే పుట్టలో పాలు పోయడం, అనంతరం స్వామి దివ్య దర్శనం, అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఉత్సవాల కోసం చలువ పందిళ్ల వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. భక్తుల దర్శనం కోసం ప్రత్యేకంగా లైన్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



పెదలంకలో ఉత్సవాలకు ముస్తాబైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

దత్తాశ్రమంలో

మండవల్లి : లోకుమూడిలోని దత్తాశ్రమంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం ఈనెల 7న వైభవంగా నిర్వహించనున్నట్టు దత్తాత్రేయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయశంకర్ తెలిపారు. ఈ నెల 7న ఉదయం 8గంటలకు స్వామివార్లకు పంచా మృతాభిషేకాలు, 9గంటలకు స్వామి దివ్య కల్యాణం, అఖండ అన్నసమారాధన జరపనున్నట్టు తెలిపారు.



వింజరంలో నేలల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ గంగాధరరావు, రైతులు

నేలల సారం కాపాడాలి

ముదినేపల్లి/కైకలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలలు సార వంతంగా ఉంటేనే పంటలు పండుతాయని, భూసార పరిరక్షణ రైతుల బాధ్యత అని మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని వడాలిలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అధ్యక్షత వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కైకలూరు మండలం వింజరంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ గంగాధరరావు, మండల వ్యవ సాయాధికారిణి దివ్య ఎంపీటీసీ నాగరాజు, గ్రామవ్యవసాయాధికారి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

కైకలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 7న ప్రతీ పాఠశాలలోనూ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా కైకలూరు మండలం భుజబలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్, కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తు న్నారు. కైకలూరు నియోజకవర్గంలోని హైస్కూల్స్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, పూర్వపు విద్యార్థులను ఈ వేడుకలకు ఆహ్వానించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మూర్ఛతో డ్రెయిన్‌లో పడి వివాహిత మృతి

కైకలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఓ వివాహిత మూర్ఛతో జువ్వకనుమల డ్రెయిన్‌లో పడి మృతి చెందింది. పెంచికలమర్రు శివారు వడ్లకూటితిప్ప గ్రామానికి చెందిన ముంగర రామారావు కుమార్తె ముంగర దుర్గ(37) గురువారం బట్టలు ఉతికేందుకు గ్రామంలోని జువ్వకనుమల డ్రెయిన్ వద్దకు వెళ్లింది. బట్టలు ఉతుకుతుండగా మూర్ఛ వచ్చి డ్రెయిన్ పడిపోయింది. స్థానికులు గమనించి ఆమెను కాపాడేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక సాయం

కైకలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మానవత సేవ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని హెచ్‌ఎం లక్ష్మీరాజేశ్వరి అన్నారు. భుజబలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బలే నిర్మలకుమారికి రూ.7,500 ఆర్థిక సాయాన్ని సంస్థ డైరెక్టర్ ముదునూరి రవీంద్రసుబ్బరాజు గురువారం అందజేశారు.